
ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

# జనబలం

ఆగస్టు 2019 రూ.10/-






## మున్సిపల్ చట్టంపై కేసీఆర్‌కు జేపీ అభినందన, మద్దతు




## ఏకపక్ష విభజన ఫెడరలిజంపై దాడే

M V Foundation

# త్రిభాషా సూత్రంపై రచ్చ కన్నా విద్యాప్రమాణాలపై చర్చ ముఖ్యం

Dignity and Freedom for all Children



నూతన జాతీయ విద్యావిధానం 2019 ముసాయిదాలోని త్రిభాషా సూత్రం చుట్టూ అవాంఛనీయ రచ్చ వల్ల అసలైన అంశం 'విద్యాప్రమాణాల'పై జరగాల్సిన చర్చ పక్కదోవ పడుతుందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఒక్కో విద్యార్థి మీద 40,000 నుంచి 70,000 రూపాయల దాకా ఖర్చు చేస్తున్నా నాణ్యమైన విద్య రావటం లేదన్నారు. దీనివల్ల పేద, అణగారిన వర్గాల విద్యార్థులు బాగా నష్టపోతున్నారన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'జాతీయ విద్యావిధానం 2019'పై రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనకు, ఎదిగే అవకాశాలకు నాణ్యమైన విద్య ఎంతో కీలకమని తెలిసినా ఎన్నికల్లో ఆ అంశాన్ని దేశంలోని ఏ రాజకీయ నాయకుడూ మాట్లాడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ఏకీకృత సర్వీస్ రూల్స్ మీద చూపిస్తున్న మక్కువను పిల్లలకు నాణ్యమైన విద్యను అందించటంపై చూపటం లేదన్నారు. నాణ్యమైన విద్య మీద రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం పూర్తిస్థాయి దృష్టిని పెట్టాలని, నూతన జాతీయ విద్యావిధానాన్ని ఆ ప్రమాణాలతోనే చూడాలని కోరారు. ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, దేశంలో నాణ్యమైన విద్యను అందించటంలో ఇప్పటిదాకా అన్ని ప్రభుత్వాలూ విఫలమయ్యాయన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా విద్యావిధానంలో మార్పు రావటం లేదన్నారు. విద్యావ్యవస్థ తీరుతెన్నులపై ఐఏఎస్ అధికారి మురళి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.నారాయణ, జేవీవీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఆదినారాయణ, యాక్షన్ ఎయిడ్ ప్రతినిధి వరప్రసాద్, వివిధ సంస్థల ప్రతినిధులు సునీత కృష్ణన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


| సంపుట | సంచిక | సంపాదకవర్గం | వర్కింగ్ ఎడిటర్ |
|---|---|---|---|
| 22 | 08 | బండారు రామ్మోహనరావు | దూసనపూడి |
| ఆగస్టు 2019 | | శిరమని నరేష్ | సోమసుందర్ |


### జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |


*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


### చందాదారులకు విజ్ఞప్తి

చాలా మంది చందా గడువు ముగిసినా జనబలం పత్రికను మీకు ప్రతీనెలా పంపుతున్నాము.అట్టివారు తప్పక తమ చందాను వెంటనే పునరుద్ధరిం చుకోగోరుతున్నాము. చందా డబ్బును Foundation for democratic reforms పేరున జనబలం కార్యాలయంనకు పంపగలరు.

### లోపలి పేజీల్లో...


06 ఇది దేశానికి బలం కాదు, బలహీనత

10 విద్యలో విజయానికి మన నిర్వచనం మారాలి!

15 ‘ఎక్స్‌ప్లో ఎడ్యుకేషన్ 2019’

31 పదవుల రాజకీయాన్ని ‘నాయకత్వ రాజకీయం’గా మార్చండి



కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288

Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

## కార్టూన్ కార్నర్




(క్రెడిట్: ఈనాడు)


సహ చట్టానికి అవసరమైన సవరణలు చేసి మరింత పారదర్శకం చేశాం చూడు.

## జనబలంలో ప్రకటన రేట్లు

| | |
|---|---|
| **కలర్‌పేజీ:** | **10,000** |
| **ఇన్‌సైడ్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **5,000** |
| **ఫుల్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **2,000** |
| **సగం పేజీ బ్లాక్ అండ్ వైట్:** | **1,000** |

ప్రకటన రుసుము, ప్రకటనకు సంబంధించిన ఫొటోలు, సమాచారం ప్రతినెలా 20వ తేదీ లోపుగా మాకు అందేలా పంపించగలరు. చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను

**చిరునామా: సంపాదకుడు, జనబలం, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక,**
*తులిప్స్ అపార్ట్‌మెంట్స్, 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,*
*సోమాజిగూడ, హైదరాబాద్-500 082*



లోక్‌సత్తా ఉద్యమ సంస్థ
మాసపత్రిక

సంపాదకీయం

# సమాఖ్య చట్రానికి కేంద్రం తూట్లు

డి. సోమసుందర్

ఒకే దేశం, ఒకే జాతి, ఒకే చట్టం పేరుతో బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రాజ్యాంగ స్ఫూర్తికి హానికల్గిస్తున్నాయి. భారతీయ సమాజంలోని బహుళత్వాన్ని, వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. అందరూ సృజనాత్మకంగా కలసికట్టుగా ఎదగడానికి వీలుకల్పించే సమాఖ్య చట్రానికి తూట్లు పొడుస్తున్నాయి. జమ్మూ - కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని హామీ ఇచ్చిన ఆర్టికల్-370, 35ఏ అధికరణం రద్దు, రాష్ట్రాన్ని రెండుగా విభజించడం వంటి చర్యలు జాతీయ సమైఖ్యతకు, సమగ్రతకు ముప్పుగా పరిణమిస్తాయి. నరేంద్రమోదీ చర్యలను కీర్తించడమే పనిగా పెట్టుకున్న ప్రసార మాధ్యమాలు నోట్ల రద్దు సందర్భంలో సైతం ఇటువంటి భజన కార్యక్రమాన్నే చేపట్టాయన్న సంగతి గుర్తు చేసుకోవాలి. స్వాతంత్ర్యోద్యమ చరిత్రతోగాని, రాజ్యాంగ రూపకల్పనా ప్రక్రియతో గాని ఏమాత్రం సంబంధం లేని శక్తులు నేడు అధికారంలోకి వచ్చాయి. గత కొన్ని దశాబ్దాలుగా జమ్మూ - కశ్మీర్‌కు సంబంధించిన చరిత్రను ఘటనలను అర్ధసత్యాలతో, అసత్యాలతో ప్రచారం చేస్తూ వచ్చాయి. భారత స్వాతంత్ర చట్టాన్ని, మౌంట్‌బాటన్ ప్రకటనను, 1947 ఆగస్టు 15 నాటికి జమ్మూ కశ్మీర్‌కు గల వాస్తవిక స్థితిని వక్రీకరిస్తూ, అలనాటి జాతీయోద్య నేతలను నిందిస్తూ ఏకపక్ష ప్రచారం సాగిస్తూ నేటి తరాన్ని ప్రక్కదారి పట్టిస్తున్నాయి.

స్వాతంత్ర్యంతో పాటు వచ్చిన దేశ విభజన ఎంతటి గాయాలను తెచ్చిందో తెలుసు. మత ప్రాతిపదికన జరిగిన మారణ హోమం చరిత్రలో నమోదై ఉంది. అంతటి అల్లకల్లో పరిస్థితిలో సైతం మత సామరస్యాన్ని చాటి చెప్పింది. జమ్మూకశ్మీర్.తొలుత స్వతంత్రదేశంగా కొనసాగాలని ఆకాంక్ష వ్యక్తం చేసిన జమ్మూ కశ్మీర్ పాలకుడు రాజాహరిసింగ్, తర్వాత పాకిస్తాన్ ప్రేరేపిత దండయాత్ర రుచి చూసిన తర్వాతనే భారత్ వద్దకు వచ్చారనేది ఒక చారిత్రక వాస్తవం. మెజారిటీ ముస్లిం ప్రజలున్న జమ్మూ కశ్మీర్ ముస్లిం మత రాజ్యమైన పాకిస్తాన్ పంచన చేరకుండా లౌకిక భారతదేశాన్ని ఎంచుకోవడానికి ఆనాటి జాతీయోద్యమ నాయకత్వంపై వారికి గల అచంచల విశ్వాసమే కారణం. కాశ్మీరీ ప్రజల స్వయం నిర్ణయాధికారాన్ని గౌరవిస్తూ, వారిని భారత్‌లో భాగం చేయడానికి జాతీయ నాయకత్వం కృషి చేసింది. డా.బి.ఆర్ అంబేద్కర్, సర్దార్ వల్లభాయి పటేల్ వంటి నేతలు కశ్మీర్‌లోయను పాకిస్తాన్‌కే వదిలెయ్యాలన్న అభిప్రాయం కల్గి ఉన్నారు. అయితే మతాల ఛాందసవాదానికి అతీతంగా మత సామరస్యానికీ, సూఫీ, బౌద్ధ విచార ధారల ప్రభావంతో ఏర్పడిన తమదైన కాశ్మీరీయత కీ కట్టుబడిన కాశ్మీరీ ప్రజలు లౌకిక భారత్‌తో ఉంటేనే తమ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని గట్టిగా నమ్మారు. రాజా హరిసింగ్ నిర్ణయంతో సంబంధం లేకుండానే కాశ్మీరీ పౌర సమాజం అప్పటికే అటువంటి నిర్ణయానికి వచ్చింది. ఆ నేపధ్యంలోనే భారత రాజ్యాంగంలో 370 అధికరణం వచ్చి చేరింది. 35ఎ కూడా వచ్చింది. ఆనాటి పరిస్థితుల్లో జాతీయ నాయకత్వం తీసుకున్న చర్యలను ఈనాటి పరిస్థితుల దృష్టితో విమర్శించడం చారిత్రక దృక్పధానికి సమాధి కట్టడమే అవుతుంది. వాస్తవాలను నిరాకరించడమే అవుతుంది. దేశంలో హిందూ ఆధిక్యతా వాద ధృవీకరణ కోసం బీజేపీ 370వ అధికరణాన్ని ఏకపక్షంగా రద్దు చేసింది. జమ్మూ - కశ్మీర్ ప్రజల అభిప్రాయానికి ఏమాత్రం విలువ ఇవ్వలేదు. ముందుగా ఎన్నికైన శాసనసభను రద్దు చేసి గవర్నర్ పాలన విధించింది. భారీగా సైనిక బలగాలను తరలించింది. జమ్మూ కశ్మీర్‌లో ప్రసార, ప్రచార సాధనాలను కమ్యూనికేషన్ వ్యవస్థలను, పత్రికలను మూసి వేసింది. అన్ని రాజకీయ పక్షాల నేతలను నిర్బంధించింది. మీడియా సిబ్బంది కదలికలపై ఆంక్షలు విధించింది. పార్లమెంటులో వేటు వేసింది.

ఇదంతా జమ్మూ కశ్మీర్ ప్రజల అభివృద్ధి కోసమేనని వారిని భారత్‌లో విలీనం కాకుండా అడ్డుగా ఉన్న 370 అధికరణం రద్దు ద్వారా జాతీయ ఐక్యత సాధ్యమవుతుందనీ ప్రధాని నరేంద్రమోదీ అంటున్నారు. రాజ్యాంగంలోని మౌలిక భావనలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య స్ఫూర్తి వంటి వాటిని దెబ్బతీసి పైకి ఉదాత్త భావనలను గంభీరంగా ప్రకటించడం కేవలం ప్రజలను ప్రక్కదారి పట్టించడమేకాగలదు.

రాష్ట్రాలకు గల రాజ్యాంగ హక్కులను కాలరాసి కేంద్ర ప్రభుత్వ పెత్తనాన్ని స్థిరీకరించే దుర్మార్గమిది. భవిష్యత్‌లో ఆర్టికల్ 371 ప్రకారం ఈశాన్య రాష్ట్రాలకు, గిరిజన, ఆదివాసీ ప్రాంతాలకూ ఉన్న ప్రత్యేక రక్షణలను కూడా తొలగించడానికి కేంద్రం తెగించబోదనే హామీ ఏమీ లేదు.

జమ్మూ కశ్మీర్ ప్రజల మనోభావాలతో ఏమాత్రం సంబంధం లేకుండా తీసుకున్న ఈ చర్యద్వారా యావద్దేశంలోనూ స్పష్టమైన మత విభజన అతి తీవ్ర జాతీయవాదం, యుద్ధోన్మాదం రెచ్చగొట్టే పథకం వేసింది. త్వరలో పీవోకేను స్వాధీనం చేసుకుంటామని చెప్పడం ద్వారా హోంమంత్రి అమిత్ షా యుద్ధసన్నద్ధతను ప్రకటించేశారు. తీవ్ర పర్యవసానాలకు దుందుడుకు చర్యలతో సమస్యలు జటిలం కావడం తప్ప పరిష్కారంకావని త్వరలోనే మనకు అనుభవం అవుతుంది.

# ఏకపక్ష విభజన ఫెడరలిజంపై దాడే.. ఇది దేశానికి బలం కాదు, బలహీనత

## 35ఎ లాంటి అధికరణల్ని అన్ని రాష్ట్రాల్లో ఎత్తివేయాలి: జమ్మూ కాశ్మీర్‌పై దేశవ్యాప్త బిగ్ డిబేట్‌కు జేపీ పిలుపు

పార్లమెంటు ఏకపక్ష నిర్ణయంతో జమ్మూ కాశ్మీర్‌ను రెండు కొత్త కేంద్రపాలిత ప్రాంతాలుగా ముక్కలు చేయటం ఫెడరలిజం మౌలిక సూత్రాలను ఉల్లంఘించటమేనని లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఇదే సూత్రాన్ని గనక దేశంలోని మిగిలిన 28 రాష్ట్రాలకూ వర్తింపచేస్తే, ఒక్క ప్రభుత్వ హుకుంతో భారతదేశం ఏకకేంద్రక దేశంగా మారిపోతుందన్నారు. ఇది సమాఖ్య సూత్రాన్ని ఉల్లంఘించటమే కాకుండా.. వివిధ రాష్ట్రాల్లో విభజన, అసమ్మతి, అనుమానం, భయాందోళనల్ని పెంచుతుందన్నారు.

అమెరికా పర్యటనలో ఉన్న జేపీ.. జమ్మూ కాశ్మీర్ విభజన, 35ఎ, 356, 370 అధికరణలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

జమ్మూ కాశ్మీర్ విషయంలో ప్రదర్శించిన మితిమీరిన కేంద్రీకృత ధోరణి ప్రజాస్వామ్య, ఫెడరల్ సూత్రాలను ఉల్లంఘించటంతోపాటు.. స్వాతంత్ర్య సమయంలో మన అసాధారణ రిపబ్లిక్ ఏర్పడటానికి పునాదిగా ఉన్న వివిధ రాష్ట్రాల ఇష్టపూర్వక అంగీకారాన్ని కూడా దెబ్బతీస్తుందని జేపీ అన్నారు. మితిమీరిన కేంద్రీకరణ, ఫెడరల్ పునాదుల్ని ధ్వంసం చేయటం దేశ ఐక్యతను, సమగ్రతను బలోపేతం చేయవన్నారు. అందుకు విరుద్ధంగా మన రిపబ్లిక్‌ను బలహీనపరిచి, విభజన, అసమ్మతి బీజాల్ని నాటుతాయన్నారు. బలమైన, ఐక్య భారతదేశానికి వ్యతిరేకంగా ఇంటా, బయటా కాచుకు కూర్చున్న శక్తులను అవి బలోపేతం చేస్తాయని హెచ్చరించారు.




ఫెడరల్ రాజకీయ వ్యవస్థలో రాష్ట్రాలను సంపూర్ణ అస్తిత్వం కలిగినవిగా గుర్తించాలని జేపీ స్పష్టం చేశారు. రాష్ట్రాల ఆమోదం, స్థానిక అంగీకారం లేకుండా వాటిని రద్దు చేయటం, వాటి సరిహద్దులను మార్చటం చేయకూడదన్నారు. “మన రాష్ట్రాల సరిహద్దులను పునస్సమీక్షించాల్సిన అవసరముందనటంలో సందేహం లేదు. కానీ ఆ పని కేంద్ర ప్రభుత్వ హుకుంతోనో లేదా ఏక పక్ష నిర్ణయాలను రాష్ట్రాల మీద రుద్దటంతోనో చేయకూడదు. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ, ఫెడరల్ రాజకీయ వ్యవస్థని పునర్నిర్మించటం, రాజ్యాంగ సంస్కృతిని బలోపేతం చేయటం, దేశ ఐక్యత, సమగ్రతల్ని పటిష్టపరచటం.. వీటన్నిటినీ ఒక సమగ్రమైన, పరస్పరాధారితమైన కార్యాచరణలో భాగంగా చూడాలి తప్ప, తాత్కాలిక అవసరాల కోసం ఆరోజుకు ఉపయోగపడుతుందనుకునే ఓ ముక్కను తీసి వాడుకుందామనుకునే ధోరణి పనికిరాదు” అని జేపీ అన్నారు.

మనకు ఇప్పుడు ఆలోచన, దూరదృష్టి గల దేశవ్యాప్త చర్చ కావాలని జేపీ అన్నారు. గెలుపు మైకం, తాము చేస్తున్నవి సర్వరోగనివారిణులనే అమాయకపు నమ్మకం ఒకవైపు.. ఇప్పుడున్న దాంట్లో ఏమాత్రం మార్పు చేసినా కొంపలు మునిగి సర్వనాశనం తప్పదనుకునే గుడ్డి విశ్వాసాలు ఇంకోవైపు– ఈ రెండు రకాల స్పందనలూ అనాలోచితమన్నారు. ఇవి దేశ ప్రజానీకం మధ్య చీలికలు తెచ్చి, తీవ్ర ప్రతికూల ప్రభావాల్ని కలిగిస్తాయన్నారు.

356, 35ఎ అధికరణాలకు సంబంధించిన అంశాలు, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం స్థానంలో రెండు కేంద్రపాలిత

ప్రాంతాలను సృష్టించాలన్న ప్రతిపాదనపై న్యాయకోవిదులు, రాజ్యాంగ నిపుణులు రాబోయే రోజుల్లో, నెలల్లో విశ్లేషిస్తారని జేపీ అన్నారు. ఈ అంశంకసుప్రీంకోర్టుకు చేరి తుది నిర్ణయాన్ని న్యాయస్థానమే వెలువరించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు.

కానీ ఈలోగా మనం న్యాయ సాంకేతికతల్ని దాటి ఆలోచించాలన్నారు. ప్రధానంగా మూడు రకాలుగా ఇందులోని అంశాల్ని పరిశీలించాలని జేపీ విజ్ఞప్తి చేశారు:

- భారత పౌరుల ప్రాథమిక హక్కులు
- దేశ ఐక్యత, సమగ్రతలను పరిరక్షించటం
- భిన్నత్వంతోపాటు అనేక బలాలు కలిగిన మన ప్రజాస్వామ్యంలో ఫెడరలిజం పరిణతి చెందడం

ఈ మూడు ప్రాతిపదికల మీద మన రిపబ్లిక్‌ను బలోపేతం చేయడానికి.. మన పౌరుల అభివృద్ధిని, స్వేచ్ఛా జీవనాన్ని పెంపొందించడానికి దిగువ దృక్కోణాలు దోహదం చేస్తాయని జేపీ వివరించారు.

"1. ఆర్టికల్ 35ఎ, దేశంలోని ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల్లో ఉన్న అలాంటి అధికరణాలూ పౌరుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నాయి. దేశ ఐక్యతను, సమగ్రతను దెబ్బతీస్తున్నాయి. ఆర్థికాభివృద్ధికి, పెట్టుబడులకు, ఉద్యోగాల సృష్టికి అవరోధాలను కల్పిస్తున్నాయి. కాబట్టి, మొత్తంగా భారతీయుల హక్కులకు ఆటంకంగా మారిన 35ఎ, ఇతర నియంత్రణలు/నిబంధనలను దేశమంతటా రద్దుచేయటం అవసరం. దీన్ని ఓ రాష్ట్రానికో, ప్రాంతానికో మాత్రమే పరిమితం చేయకుండా, ఇదే సూత్రాన్ని భారతదేశం మొత్తానికీ వర్తింపచేయాలి. ప్రజల్ని 'రక్షించే' పేరుతో కొన్ని ప్రాంతాల్ని, కొన్ని సమూహాలను వేరు చేయటం వల్ల నిజానికి ఆ ప్రాంత ప్రజల ఆర్థికవృద్ధి దెబ్బతిని, పేదరికం కొనసాగుతోంది. వారిలో కొత్త ఆలోచనలను కుంగదీసి, నూతన సంస్కృతులు, ఆలోచనలతో సంపర్కంతో ఎదిగే అవకాశాల్ని దెబ్బతీసింది. దేశ ఐక్యత, సమగ్రతలను బలహీనపరిచింది.

2. ఆర్టికల్ 370 నిబంధనల్ని ఓ సంధి దశలో, తాత్కాలిక అవసరాల కోసమే ఏర్పాటు చేశారన్నది సుస్పష్టం. అయితే, ఆర్టికల్ 370కి సంబంధించి రెండు భిన్న కోణాలున్న అంశాలున్నాయి. ఆర్టికల్ 35ఎ ఆవిర్భావానికి దోహదం చేసిన నిబంధనలు నిజానికి ఏమాత్రం ప్రయోజనం లేనివి. వాణిజ్య అవరోధాలు తొలగిపోతూ, సరఫరా ప్రపంచవ్యాప్తమవుతున్న ప్రస్తుత కాలంలో అవి పనికిమాలినవిగా తయారయ్యాయి. ఏ రూపంలోనైనా ప్రాథమిక హక్కుల అమలును నియంత్రించే లేదా అధికారాల విభజనను ఉల్లంఘించే, రాజ్యాంగపరమైన పరస్పర పర్యవేక్షణలు, అందరికీ ఓటుహక్కు, ప్రజాస్వామ్యం, ఎన్నికైన ప్రతినిధుల ద్వారా ప్రజల సార్వభౌమాధికారాలను నియంత్రించే నిబంధనలను కూడా 35ఎ రీతిలోనే కాలం చెల్లినవిగా, నిరుపయోగకరమైనవిగా తీసిపారేయాలి.

3. ఐక్యత అంటే కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ మూస పోసినట్లు ఒకేలా ఉండటం కాదు. ఐక్యత స్వేచ్ఛను పెంచుతూ సామరస్యాన్ని పెంపొందిస్తుంది. ఏకరూపత స్వేచ్ఛను, కొత్తగా ఆలోచించే శక్తిని అణగదొక్కుతుంది. ఒక రాష్ట్రం దేశ ఐక్యత, సమగ్రతలకు కట్టుబడి, ప్రజాస్వామ్య, రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడి కొత్త పద్ధతిలో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకుంటే.. అది దాని భిన్నత్వానికి, వైవిధ్యానికి అద్దం పట్టే బలమైన ప్రజాస్వామ్యమే అవుతుంది తప్ప బలహీనత అవదు. మన పార్లమెంటరీ ప్రజాస్వామానికి మాతృకగా భావించే యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)లోనే స్కాట్లాండ్‌లో ఒకలా, ఉత్తర ఐర్లాండ్‌లో ఇంకోలా వేల్స్‌లో, లండన్ నగరంలో మరోలా ఎన్నికల పద్ధతులున్నాయి. అలాగే యూరోపియన్ పార్లమెంటుకు ఇంకో రకం ఎన్నికల పద్ధతి ఉంది. వివిధ రకాల స్వేచ్ఛలు, ప్రజాస్వామ్య, రాజ్యాంగ మౌలిక సూత్రాలు దేశవ్యాప్త విధానంగా అమలవుతున్నంత వరకూ.. స్థానికంగా ఈ వైవిధ్యం, నచ్చిన పద్ధతిలో ప్రభుత్వాన్ని ఎన్నుకునే స్వేచ్ఛ.. దేశ ఐక్యతను, కాలానుగుణంగా నూతన ఆలోచనాధోరణుల్నీ పెంచేవే అవుతాయి.

4. ఆధునిక ప్రజాస్వామ్యంలో గవర్నర్లను రాష్ట్రాలకు నియమించటం కాలం చెల్లిన పద్ధతి. రాష్ట్రాల్లో, స్థానిక ప్రభుత్వాల్లో ప్రభుత్వాలు ఏ నమూనాలో ఉండాలి, ప్రజలు సంఘాలుగా ఏర్పడి పరస్పర సహకారంతో నచ్చిన పనులు ఎట్లా చేసుకోవాలి (పార్ట్ 9బి) వంటి నిబంధనల వివరాలతో రాజ్యాంగాన్ని నింపుతూ భారం మోపటం అర్థరహితం. ఎంతో భిన్నత్వం కలిగిన, సువిశాలమైన మన దేశంలో ప్రతి రాష్ట్రం, ప్రాంతం మూస పోసినట్లు ఒకేరీతిలో ఉండాల్సిందే అంటే.. అది పాలనలో తప్పుడు అంచనాలకు, అవగాహనలేని నిర్ణయాలు, పాలనా నమూనాలకు దారితీస్తుంది. చివరకు మొత్తం దేశం చాలా పెద్ద మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అటువంటి మితిమీరిన కేంద్రీకృత నమూనాతో పొరపాట్లకు నష్టం భారీగా ఉంటుంది. సృజనాత్మకత స్తంభించిపోతుంది. దిద్దుబాట్లు చేసుకోవటం కష్టసాధ్యమవుతుంది".

పైన పేర్కొన్న సూత్రాల పరిధిలో.. దేశ ఐక్యతను పెంపొందించటానికి, స్థానికంగా ప్రజలకు నచ్చిన పాలనా పద్ధతుల్ని అనుమతించటం ద్వారా ఎక్కడికక్కడ నూతనత్వాన్ని ప్రోత్సహించటానికీ ఇదో అద్భుత అవకాశమని జేపీ అన్నారు.

"పార్టీల పరమైన విభేదాలను పక్కనబెట్టి, ఇందులోని సంక్లిష్టమైన అంశాలను స్పష్టతతో, విజ్ఞతతో, మానవాళిలో ఆరో వంతు ఉన్న మన గొప్ప దేశ భవిష్యత్తు పట్ల నిండైన అంకితభావంతో ఆలోచించవలసిందిగా భారతీయులందరినీ కోరుతున్నా" అని జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తే తెలంగాణతో సంబంధమేంటి, కేంద్రాన్ని విమర్శిస్తే దేశంతో సంబంధమేంటి.. అంటారా?

**జేపీపై విమర్శల మీద గుండెల మీద చెయ్యేసుకుని చెప్పండి కేసీఆర్: లోక్‌సత్తా సవాల్!**

ప్రజల పన్నుల డబ్బు నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయి తెలంగాణ రైతులకు, ప్రజానీకానికి సద్వినియోగం కావాలన్న లక్ష్యంతోనే లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కాళేశ్వరం ప్రాజెక్టులో అసంబద్ధ వ్యయం గురించి ప్రశ్నించారని.. దీనికి హేతుబద్ధమైన చర్చతో సమాధానాలు చెప్పాల్సిందిపోయి 'తెలంగాణకు, జేపీకి సంబంధం ఉందా? హాఫ్‌నాలెడ్జ్' వంటి వ్యాఖ్యలను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు చేయటం తీవ్ర అభ్యంతరకరమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసవర్మ అన్నారు. రాష్ట్ర ప్రజల పట్ల ప్రేమ, బాధ్యతతో రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే మీకు, తెలంగాణతో సంబంధమేంటని.. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తే మీకు, భారతదేశానికి సంబంధమేంటని అంటుంటే.. ఇక ప్రజాస్వామ్యం, పౌరసత్వం ఎందుకు? ప్రజాప్రయోజనాలకు గ్యారంటీ ఏమిటి? అని ప్రశ్నించారు. తెలంగాణకు, జేపీకి సంబంధం ఉందో, లేదో.. జేపీ పరిజ్ఞానమెంతో కేసీఆర్ తన అంతరాత్మను అడిగితే తెలుస్తుందని, గుండెల మీద చెయ్యేసుకుని నిజం చెప్పే శక్తి తనకుందో లేదో కేసీఆరే తేల్చుకోవాలన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలన సందర్భంగా జేపీపై కేసీఆర్ చేసిన విమర్శలపై లోక్‌సత్తా పార్టీ నేతలు నిశితంగా సమాధానమిచ్చారు.

"ప్రజాస్వామ్యంలో నిర్దిష్టమైన అంశాల మీద వాస్తవాలు, సాక్ష్యాధారాలు, ప్రజాప్రయోజనాల ఆధారంగా చర్చ జరగాలి తప్ప, తిట్లు, బూతులతో కాదు.

**తెలంగాణ రైతులపై ప్రభుత్వ ఆంక్షలకు వ్యతిరేకంగా పోరాడి రేటు తెచ్చింది జేపీ**

"రైతులకి మేలు జరగాలని, ప్రతి నీటి చుక్కా సద్వినియోగం కావాలని జేపీ తొలినుంచీ వాదిస్తున్నారు. రైతుల ప్రయోజనాల కోసం, నీటి పారుదల కోసం ఒక వ్యక్తిగా, అధికారిగా, ఒక ఉద్యమ నేతగా ఆయన జీవితమంతా పోరాడారు. ఎన్నో ఫలితాలను సాధించారు. ధాన్యానికి రేటున్న పక్క రాష్ట్రాల్లో అమ్ముకోకుండా ఆంక్షలు విధించి తెలంగాణలో వరి పండించే రైతులకు రేటు రాకుండా చేస్తే, అప్పుడు ప్రభుత్వం మీద పోరాడింది జేపీయే. ఆనాడు తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా నుంచి నాందేడ్ దాకా రైతు సత్యాగ్రహ యాత్ర చేసి బియ్యం మూటను భుజాన వేసుకుని మహారాష్ట్రలో జేపీ అమ్మారు. ప్రభుత్వ నియంతృత్వాన్ని ఎండగట్టారు. మహారాష్ట్రలోని షేత్కారీ సంఘటన్ వ్యవస్థాపకుడు శరద్ జోషి మద్దతుతో అక్కడ బియ్యాన్ని బహిరంగంగా విక్రయించారు. దీంతో ఆంక్షల సంకెళ్లు తెగి తెలంగాణలో బియ్యం బస్తా రేటు రూ.750 నుంచి 1200కి పెరిగింది. ఇలా చేసిన పోరాటాలు ఎన్నో ఉన్నాయి. బహిరంగ చర్చ ఆరోగ్యంగా ఉండాలిగానీ, తెలంగాణ ప్రభుత్వాన్ని విమర్శిస్తే తెలంగాణకు-ఆయనకు సంబంధమేంటి, కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తే దేశానికి-ఆయనకు సంబంధమేంటి అనటం అప్రజాస్వామికం, ప్రజాస్వామ్య వ్యతిరేకం.

**48 ఏళ్ల క్రితమే కాళేశ్వరంలో జేపీ**

ఇక కాళేశ్వరం గురించి జేపీకి తెలుసా, ఎప్పుడైనా వెళ్లారా? అని కేసీఆర్ అడిగారు. కేసీఆర్‌కు తెలియకపోవచ్చు.. 1981లో నెలరోజులపాటు కాళేశ్వరంలోనే జేపీ నివసించారు. త్రిలింగాలలో ఒకటైన కాళేశ్వరం దేవాలయాన్ని కీర్తిశేషులు, పెద్దలు చొక్కారావు పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్న క్రమంలో పలుమార్లు ఆ దేవాలయాన్ని జేపీ సందర్శించారు. జేపీ శిక్షణ పొందింది కరీంనగర్ జిల్లాలో.

**చేవెళ్ల-ప్రాణహితపై జేపీ వాదనను ఆనాడు కేసీఆరే సమర్థించారు**

కాళేశ్వరం ప్రాజెక్టు విషయానికొస్తే 11 ఏళ్ల క్రితం చేవెళ్ల-ప్రాణహిత ప్రతిపాదన వచ్చినప్పుడే.. పెట్టే ఖర్చుకి-రైతులకు వచ్చే ఫలితానికి సంబంధం ఉండాలని జేపీ గట్టిగా వాదించారు. రాష్ట్ర శాసనసభలో పలుమార్లు గణాంకాలతో సహా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజాధనాన్ని దుబారా చేయకుండా, అంతే డబ్బుని, అంతకంటే ఎక్కువ డబ్బుని తెలంగాణ రైతుల కోసం నిపుణులను సంప్రదించి నిజమైన ఫలితాలను, తక్కువ ఖర్చుతో ఇచ్చే ఇతర పథకాలను చేపట్టాలని మళ్లీ మళ్లీ సూచించారు. ఆనాడు కేసీఆర్ జేపీ వాదనను సమర్థించి, చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు తెలంగాణ ప్రజలను మోసం

చేయటానికే ప్రతిపాదించారని విమర్శించారు. ఆ ప్రాజెక్టును కేసీఆర్ ధైర్యంగా విమర్శించటాన్ని నవంబర్ 17, 2012న జేపీ మీడియా సమావేశం పెట్టి మరీ అభినందించారు.

అఖిలపక్షంలో నిజం చెప్పింది జేపీ మాత్రమే అన్నది కేసీఆరేగా.

ఇక లోక్‌సత్తాకు గానీ, జేపీకి గానీ పనిగట్టుకుని ఒక ప్రభుత్వాన్నో, పార్టీలనో విమర్శించడం ఏనాడూ లక్ష్యం కాదు. అంశాల ప్రాతిపదికన, వాస్తవాల ఆధారంగా మంచి చేస్తే అభినందించడం, పొరపాట్లు జరిగితే విమర్శించడమే లోక్‌సత్తా ఆనవాయితీ. 14 ఎఫ్ మీద అఖిల పక్ష సమావేశం జరిగితే, ఆనాటి ప్రభుత్వం, ప్రతిపక్షాలు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని, 14 ఎఫ్ తొలగింపునకు అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంతో కూర్చుని దాన్ని తొలగించేలా చేయాలని జేపీ కోరారు. కేసీఆర్ సూర్యాపేట తదితర చోట్ల సభల్లో 'ఒక్క జేపీ మాత్రమే అఖిలపక్షంలో నిజం మాట్లాడారు' అని బహిరంగంగా ప్రకటించారు. అలాగే తెలంగాణ ప్రజలు బలంగా కోరుకుంటున్నారు కాబట్టి.. అన్ని ప్రాంతాల మధ్యా సయోధ్య కుదిర్చి రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని జేపీ గట్టిగా వాదించారు. అదేసమయంలో భావోద్వేగాలను రెచ్చగొట్టటం, ఒక రాష్ట్రం ఏర్పడగానే అద్భుతాలు జరుగుతాయని అవాస్తవాలు చెప్పటాల్ని ఖండించారు. అదేరీతిన సమైక్యాంధ్ర కోసం ఉద్యమాలు చేస్తుంటే, బలవంతంగా రాష్ట్రాన్ని కలిపివుంచటం సబబు కాదని, పరిష్కారాలు అందరి ప్రయోజనాల్నీ కాపాడే రీతిలో రాష్ట్ర విభజనే పరిష్కారమని జేపీ వాదించారు. ఆ కారణంగా ఆంధ్ర ప్రాంతంలో నిరసనల్ని, దాడుల్ని ఎదుర్కొన్నారు. సామరస్య వాతావరణం నెలకొల్పినందుకు కేసీఆర్‌ను పలుమార్లు జేపీ బహిరంగంగా అభినందించారు,

**తాజాగా మునిసిపల్ చట్టం విషయంలోనూ మద్దతిచ్చారు**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక, అప్పటి వరకు ఉన్న వైషమ్యాల్ని తగ్గించి సామరస్య వాతావరణాన్ని ఏర్పరచటంలో కేసీఆర్ పాత్రను జేపీ పదేపదే బహిరంగంగా అభినందించారు. ఏటా రూ.5,000 కోట్లను ప్రత్యక్షంగా స్థానిక ప్రభుత్వాలకు రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేస్తుందని ప్రకటించినప్పుడు మనస్ఫూర్తిగా ప్రశంసించారు. కానీ స్థానిక ప్రభుత్వాలకిచ్చిన ఆ హామీని కేసీఆర్ నెరవేర్చలేదు. ఇటీవల మునిసిపల్ చట్టాన్ని తెచ్చినప్పుడు కూడా.. అందులో పౌర సేవలకు సిటిజన్ ఛార్టర్లను పెట్టటం, మునిసిపాలిటీల పాలనలో జవాబుదారీతనాన్ని తేవటానికి ఏర్పాట్లు చేయటంతో కేసీఆర్‌ను, తెలంగాణ ప్రభుత్వాన్ని జేపీ అభినందించి, బలంగా మద్దతిచ్చారు. అదే సమయంలో కేసీఆర్ ప్రభుత్వం ఏకపక్షంగా పొరపాటు నిర్ణయాలు చేస్తున్నప్పుడు వాటిని కూడా అదేరీతిలో జేపీ విమర్శించారు. రాచరికపు పోకడలతో ముఖ్యమంత్రి నివాసం కోసం మహాప్రాసాద నిర్మాణం కావచ్చు, ఇందిరాపార్కు దగ్గరలో వేలాదిమందికి ఆటస్థలంగా ఉన్న స్టేడియంలో పెద్ద భవన నిర్మాణం చేయాలనుకోవటం కావచ్చు.. జేపీ వ్యతిరేకించి విమర్శించారు. రాష్ట్ర ఏర్పడక ముందు మెట్రో రైలును ధ్వసం చేస్తామని కేసీఆర్ అంటే జేపీ తీవ్రంగా ఖండించారు. అదే మెట్రోని అధికారంలోకి వచ్చాక కేసీఆర్ చేపట్టారు. ఇప్పుడు అసెంబ్లీ, సెక్రటేరియట్‌ల కూల్చివేత వంటి అంశాల మీద కేసీఆర్ ప్రభుత్వం దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటున్నా, ఇవి చిన్న అంశాలు, ప్రజాప్రయోజనాలతో పెద్దగా సంబంధంలేని అంశాలు కావటంతో జేపీ స్పందించలేదు.

విమర్శరాగానే విద్వేషాల్ని రెచ్చగొట్టటం, తూలనాడటం ఆరోగ్యకరమైన చర్చ కాదు

ప్రజాధనం అత్యంత పవిత్రం. సామాన్య ప్రజలు కష్టించి సంపాదించే డబ్బులో కొంతభాగాన్ని పన్నుల రూపంలో ఇస్తూ ప్రభుత్వాన్ని పోషిస్తున్నారు. అలాగే మన జీవితాల్ని ఫణంగా పెట్టి ప్రభుత్వం పెద్దఎత్తున అప్పులు చేస్తోంది. మళ్లీ తీర్చాల్సింది సామాన్య ప్రజలే. ప్రభుత్వం పెట్టే ఖర్చులో ప్రతి రూపాయీ ప్రజలకి పూర్తి ప్రయోజనం చేకూర్చాలి. అందుకే అసంబద్ధమైన పథకాలనుగానీ, దుబారా ఖర్చులనుగానీ లోక్‌సత్తా సహేతుకంగా విమర్శిస్తుంది. మంచి విధానాల్ని, చట్టాల్ని లోక్‌సత్తా ఆహ్వానిస్తుంది.

విమర్శరాగానే ప్రాంతీయతత్వాన్ని తీసుకురావటం, విద్వేషాల్ని రెచ్చగొట్టటం, వ్యక్తిత్వాన్ని తూలనాడటం ఆరోగ్యకరమైన చర్చ కాదు. విమర్శను వాస్తవాలతో, సరైన తర్కంతో, ప్రజాప్రయోజనాల ఆధారంగా ఎదుర్కోవాలిగానీ, ఉద్రేకాలను రెచ్చగొట్టటంతో కాదు. ఎంతో అనుభవమున్న కేసీఆర్‌గానీ, ప్రజాజీవనంలో ఉన్న ఇతర నాయకులుగానీ ప్రజాస్వామ్యంలో బహిరంగ చర్చలో ఆరోగ్యకరమైన ప్రమాణాలను పాటించటం ప్రజల ప్రయోజనాలకు అత్యంత అవసరం.

ఈ రకమైన దూషణలతో బహిరంగ చర్చను అణగదొక్కటం గానీ, తెలంగాణ ప్రజాప్రయోజనాల రీత్యా హేతుబద్ధ వాస్తవాలను, పరిష్కారాలను చెబుతున్న లోక్‌సత్తా గళాన్ని నొక్కే ప్రయత్నంగానీ నిష్ప్రయోజనం. ప్రజల పక్షాన లోక్‌సత్తా నిష్పాక్షికంగా తన వాదనల్ని వినిపిస్తూనే ఉంటుంది" అని తుమ్మనపల్లి శ్రీనివాస్, శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు.

# విద్యలో విజయానికి మన నిర్వచనం మారాలి!

డాక్టర్ వెలమాటి మనోహరి,
గాయత్రి మేకా,
వ్రితి బన్సాల్
(ఎఫ్‌డీఆర్ పరిశోధనా బృందం)



విద్యావంతులను గౌరవించటం మన దేశంలో అనాదిగా వస్తున్న సంప్రదాయం. చదువుకున్నవారిని గౌరవించే దశ నుంచి.. మనం కూడా చదువుకుని వారిలా తయారవుదామని బలంగా ఆకాంక్షించే స్థాయికి ఇప్పుడు దేశం వచ్చింది. చదువుకు ఇంత డిమాండ్ ఏర్పడినా, అనేకమంది తల్లిదండ్రులు త్యాగాలు చేస్తూ మరీ తమ బిడ్డల్ని చదవిస్తున్నా, మన పిల్లలు ప్రపంచంలోని అగ్రదేశాల పిల్లలకన్నా కూడా చురుకైనవారే అయినా.. అత్యధికులకు మాత్రం సరైన చదువు అందటం లేదు. విద్యను గౌరవించటం, విద్య ద్వారా ఆదాయాన్ని పొందాలనుకోవటం తప్ప విద్య యొక్క సమగ్ర విలువేంటో ఎక్కువమందికి తెలియకపోవటం వల్ల.. పనికొచ్చే విద్యను అందరికీ అందించాల్సిన ప్రభుత్వాలు పైపై మెరుగులకే పరిమితమవుతున్నాయి. విద్య పేరుతో డబ్బు ఖర్చు చేస్తున్నాయి తప్ప వాస్తవ ఫలితాల్ని పట్టించుకోవటం లేదు. దీనివల్ల ఈవేళ ఇండియాలో కేవలం 10 - 20 శాతం మందికి మాత్రమే నాణ్యమైన చదువు అందుతోంది. మిగిలినవారు చదువుకుంటున్నామని భ్రమపడుతూ డిగ్రీ కాగితాలున్న నిరుద్యోగులుగా, పౌరశక్తిలేని ప్రజలుగా మిగిలిపోతున్నారు. మనం మాత్రం ఈ సంక్షోభాన్ని పట్టించుకోకుండా, ఏ సమస్యా లేదనట్లు నటిస్తున్నాం. శతాబ్దాలుగా మన దేశంలో పాతుకుపోయిన అమానుషమైన కుల వివక్ష వంటి పొరల్ని మనం ఇంకా తొలగించుకోలేదు కాబట్టి మనకు విద్యావైఫల్యం ప్రభుత్వాలు, సమాజం చేస్తున్న ఘోరపాపంగా అనిపించటం లేదు. మన పొరుగున ఉన్న చైనా సహా అనేక దేశాలు ఇలాంటి వివక్షల్ని అధిగమించగా, మన దేశం మాత్రం ఇంకా ఏదోకరూపంలో వివక్ష భావజాలం చుట్టూనే అభివృద్ధిని చూపించే ప్రయత్నం చేస్తోంది. ప్రపంచంలో, ఆసియాలో, దక్షిణాసియాలో హమారా భారత్ ఒక్కటే ఈ వివక్ష సంకెళ్లను ఇంకా వారసత్వ బంగారు ఆభరణంలా మోస్తున్న దేశం. ఇది కేవలం నైతికాంశం కాదు. పెద్ద ఆర్థిక అంశం కూడా. కేవలం పది, ఇరవై శాతం మంది మాత్రమే ఈ దేశాన్ని సమున్నత స్థాయికి తీసుకెళ్లలేరు. అలా జరిగేట్లయితే ఈపాటికే భారతదేశం అగ్రస్థాయికి చేరుకుని ఉండేది. నా చిన్నప్పటి నుంచీ భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఎందుకుంది?..

అని చాలామంది అమాయకంగా అడుగుతుంటారు. వివక్షల్ని తొలగించని పాలన, రాజకీయం, సమాజంలోనే వారందరికీ సమాధానం దాగి వుంది. అన్ని రకాల వివక్షలు తొలగి, ఏ కుటుంబంలో పుట్టినా ఎదిగే అవకాశాలు అందరికీ లభించే పరిణతి ప్రజాస్వామ్య నెలకొనాలంటే.. అందుకు ఏకైక మార్గం, మంత్రం.. నాణ్యమైన చదువు! కానీ మనం ఇంకా ఎక్కడున్నాం? 21వ శతాబ్దపు మానవాళి ప్రస్థానం, ఇతర గ్రహాలకు ప్రయాణం వంటివి ఆలోచించాల్సిన దశలో.. ఇంకా మనం విద్య పూర్తి చేశాక మళ్లీ వేరేగా నైపుణ్యాల శిక్షణను ఇవ్వటం దశలో ఉన్నాం. ఈ నేపథ్యంలోనే లోక్‌సత్తా మాతృసంస్థయిన ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్‌- ఎఫ్‌డీఆర్) 'ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్ 2019' పేరుతో ఇటీవల ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో విద్యాయాత్రను నిర్వహించింది.

విద్యకు పునాది అయిన పాఠశాల విద్య బాగుపడితేనే విద్యావ్యవస్థ బాగుపడుతుంది. అందుకే 12వ తరగతి వరకు విద్యను బాగు చేయటం మీద, అది కూడా ముందు తెలుగు రాష్ట్రాల్లో బాగు చేయటం మీద దృష్టి పెట్టాలని, ఆ తర్వాత జాతీయస్థాయిలో కూడా ప్రయత్నిద్దామని ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ మెంటారింగ్‌లో



సూచించారు. స్కూళ్లలో పిల్లల్ని చేర్చటం ఈవేళ పెద్ద సమస్య కాదని, అలాగే ప్రభుత్వ, ప్రయివేటు అనేది కూడా ఆచరణాత్మక అంశం కాదని.. పిల్లకి, పిల్లవాడికి మంచి విద్య అందుతోందా, లేదా అన్నదే మన మొదటి, చివరి లక్ష్యం కావాలని నిర్దేశించారు. దేశంలోని కొన్ని ఇతర రాష్ట్రాల్లో కంటే కూడా ఎంతో నాసిరకంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పాఠశాల విద్యాప్రమాణాలు ఉన్నాయని 'అసర్' వంటి ప్రామాణిక సర్వేలు కొన్నేళ్లుగా తెలియజేస్తున్నాయి. రాష్ట్ర విభజన జరిగాక ప్రభుత్వాలే స్వయంగా చేయించిన సర్వేలు కూడా ఈ విషయాన్ని ధృవీకరించాయి. 14-18 సంవత్సరాల మధ్య వయసున్న విద్యార్థుల్లో సగం మంది గడియారంలో ముళ్లు చూసి టైమ్ కూడా చెప్పలేరని తేల్చాయి. మన దేశంలో జరిగే ఈ సర్వేల కంటే కూడా వివిధ దేశాల మధ్య చేసే 'పీసా' సర్వేలో ఇంకొంచెం ఎక్కువ ప్రమాణాలుంటాయి. ఉదాహరణకు, లెక్కల్లో దేశీయ సర్వేలో తీసివేతో, భాగాహారమో, హెచ్చవేతో చేయమని అడిగితే.. పీసా సర్వేలో భాగహారం ఎందుకు చేయాలి, భాగించేటప్పుడు భిన్న హారము ఎందుకుండాలి? అనే రీతిలో ప్రశ్నలు ఉంటాయి. తర్కం, పరిశీలన, విశ్లేషణ, సృజనాత్మకత, సమాజాన్ని పట్టించుకోవటం వంటి అంశాలతో ప్రశ్నలుంటాయి. అలాంటి పీసా సర్వేలో మన దేశం 74 దేశాల్లో 73వ స్థానంలో ఉంది. మన కంటే అధ్వాన్నంగా చిట్టచివరి స్థానంలో కిర్గిజిస్థాన్ దేశంలోనైనా ఆ సర్వే కొంత అలజడి సృష్టించిందిగానీ.. మన పాలనలో, రాజకీయంలో, సమాజంలో ఆ సర్వే గురించి ఆందోళనే కనిపించలేదు. అలాగే జేపీ సురాజ్య యాత్రలో భాగంగా పలు స్కూళ్లను సందర్శించారు. వీటిలోనూ చాలామేరకు విద్యాప్రమాణాల వైఫల్యమే కనిపించింది. ప్రభుత్వ, ప్రయివేటు తేడా పెద్దగా లేకుండా మన పాఠశాల విద్యలో



ప్రమాణాలు కొరవడ్డాయని తేల్చటానికి మరోసారి విద్యాయాత్ర పేరుతో స్కూళ్లను సందర్శించనక్కర్లేదు. ఇప్పుడు కావలసింది పరిష్కారం. తెలంగాణ, ఏపీల్లో కలిపి 65 లక్షలకుమందికిపైగా పిల్లలు అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. వీరిలో ఒక్కో విద్యార్థి మీద ప్రభుత్వాలు ఏటా రూ.80,000 - 90,000 దాకా ఖర్చు చేస్తున్నాయి. ఇది మంచి చదువు అందిస్తున్న కొన్ని ప్రైవేటు స్కూళ్ల ఫీజుల కంటే కూడా చాలా ఎక్కువ. అయినా సర్కారీ బడుల్లో ఎందుకు పనికొచ్చే చదువు రావటం లేదు? ఈ సంక్షోభానికి పరిష్కారాలేమిటి?.. వీటిని పరిశీలించటం కోసం విద్యాయాత్రను ఎఫ్‌డీఆర్ చేపట్టింది.

పరిష్కారాల్ని మరింత లోతుగా అధ్యయనం చేసి గుర్తించటమే లక్ష్యం కాబట్టి.. మంచి విద్యకు ప్రమాణంగా

పేరొందిన పాఠశాలల్నే సందర్శనకు ఎంచుకున్నాం. ఇందులో ఒక ప్రభుత్వ పాఠశాల కూడా ఉంది. విద్యలో గణనీయ కృషి చేసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో, విద్యారంగ అధికారులతో కూడా చర్చించాం. జులై 24 సాయంత్రం చిత్తూరు జిల్లా రిషీవ్యాలీలో మొదలైన మా విద్యాయాత్రను జేపీ ప్రారంభించారు. ఆ తర్వాత విజయవాడ, కల్వకుర్తి, హైదరాబాద్‌లలో పర్యటించాం. వారం రోజులపాటు విద్యాయాత్ర అంటే తక్కువ సమయం కాబట్టి.. చాలా లోతుగా, నిశితంగా పరిశీలించేందుకు వీలుగా తక్కువ స్కూళ్లనే ఎంచుకున్నాం. మా బృందంలో 25 మంది స్వచ్ఛందంగా పాల్గొన్నారు. వీరంతా మంచి విద్య కోసం ఛాంపియన్లుగా నిలబడతామని సొంత డబ్బుతో ముందుకొచ్చినవారు. వీరిలో అనేకమంది విషయ పరిజ్ఞానమున్నవారు, నిష్ణాతులు కావడంతో మా అధ్యయనం సులువైంది. మేం నాలుగు ప్రధాన కోణాలలో నాలుగు బృందాలుగా పనిచేశాం. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బోధన, అభ్యసన సామర్థ్యాలను పరీక్షించే తీరు, ఈ స్కూళ్లలో అమలు చేస్తున్న ఉత్తమ పద్ధతుల్ని ఇతర స్కూళ్లన్నిటిలో అమలు చేయటానికి అవకాశాలు.. అనే అంశాల మీద అధ్యయనం చేశాం.

ఈ స్కూళ్లన్నిటిలో మేం బాగా గమనించినది 'విద్యలో విజయానికి భిన్నమైన నిర్వచనం ఇవ్వటం'! ఎక్కడైతే ప్రభుత్వం డబ్బు గుమ్మరిస్తోందో, ఎక్కడైతే తల్లిదండ్రులు ఎగబడి తమ పిల్లల్ని అప్పులు చేసి మరీ చదివిస్తున్నారో, ఆ స్కూళ్లలో సక్సెస్‌కి, ఈ స్కూళ్లలో సక్సెస్‌కి నిర్వచనంలో చాలా తేడా ఉంది. ఇక్కడ పిల్లవాడు నేర్చుకోవటానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ బోధన మొదలుపెడుతున్నారు. ఉదాహరణకు రిషీవ్యాలీ స్కూల్ ఆధ్వర్యంలో కొన్ని స్కూళ్లలో ప్రాథమిక విద్యాబోధన చేయిస్తున్నారు. ఇందుకు చొరవ తీసుకున్నందుకు ఏపీ ప్రభుత్వాన్ని అభినందించాల్సిందే. ఈ రిషీవ్యాలీ అనుబంధ స్కూళ్లకు 'రివర్' శాటిలైట్ స్కూళ్లుగా నామకరణం



చేశారు. ఇక్కడ ఇతరత్రా అంశాలను పరిగణలోకి తీసుకోకుండా కేవలం విద్యార్థి సామర్థ్యాన్ని బట్టే బోధన చేస్తున్నారు. ఒకే తరగతిలోని విద్యార్థుల్లో సామర్థ్యం నాలుగైదు స్థాయిల్లో ఉంటే.. వాళ్లని బృందాలుగా విడదీసి, దిగువ స్థాయిలో బృందంలోనివారికి మూలాల నుంచి పరిజ్ఞానాన్ని నేర్పిస్తున్నారు. మెరుగైన వెంటనే పై బృందంలో చేరుస్తున్నారు. క్రమంగా సోపానాల పద్ధతిలో మొత్తం తరగతిని విద్యాప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. బోలెడంత విషయాన్ని బోధించటం కన్నా.. కాన్సెప్టులను చెప్పటానికే ప్రాధాన్యమిస్తున్నారు. ఇక్కడి విద్యార్థుల ముఖాల్లో మార్కుల భయం ఏమాత్రం కనిపించలేదు. ఉపాధ్యాయుడు చెప్పినది పరిశీలించటం, ప్రశ్నించటం, నేర్చుకోవటం అనే కోణంలోనే పిల్ల, పిల్లాడి చదువు సాగుతోంది.

రివర్ స్కూళ్ల మధ్య కూడా ఒక తేడాను గమనించాము. కమ్యూనిటీల ఆధ్వర్యంలో ఉన్న స్కూల్‌లో బోధన, ప్రమాణాలు, విద్యార్థుల్లో ఉత్సుకత వంటివి మెరుగ్గా ఉండగా, ఇదే రిషీవ్యాలీ ఆధ్వర్యంలో నడుస్తున్నా కూడా.. ప్రభుత్వ పాఠశాలలో కొంత యాంత్రిక వాతావరణం కనిపించింది. పర్యవేక్షణ, జవాబుదారీతనం లేకపోవటం వల్లే ఆ తేడా! పర్యవేక్షణ, జవాబుదారీతనం ఉండటం వల్ల పాఠశాల లక్ష్యమైన 'విద్యార్థి చదువు' కమ్యూనిటీ స్కూల్‌లో మెరుగ్గా ఉంటే, అవి లేకపోవడం వల్ల సర్కారీ బడిలో మార్పు ప్రయత్నం కూడా సాధారణ స్థాయిలో ఉంది.

విజయవాడలో జడ్పీ హైస్కూల్‌ని సందర్శించినప్పుడు మౌలిక వసతులకు, ఇతర అవసరాలకు నిధుల కొరత ఏమాత్రం లేకపోవటాన్ని గమనించాం. అక్కడ ఇంగ్లీషు మాధ్యమంలో బోధన ఇంకా గాడిన పడలేదు. పిల్లలు తంటాలు పడి రాస్తున్నారుగానీ, తమ ఆలోచనల్ని, భావాల్ని మౌఖికంగా వ్యక్తీకరించలేకపోతున్నారు. ఇంగ్లీషు మాధ్యమ బోధనకు తగిన వాతావరణం లేదని

ఉపాధ్యాయురాలు తెలిపారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్య ఇంఛార్జి కమిషనర్, సర్వశిక్షా అభియాన్ స్పెషల్ ప్రాజెక్ట్ డైరెక్టర్లను కలిసి.. విద్యాప్రమాణాల వైఫల్యాలు, మాస్ కాపీయింగ్ గురించి ప్రశ్నించాం. సమస్యల్ని పరిష్కరించే ప్రయత్నం కొనసాగుతోందని, విద్యాప్రమాణాల పెంపు, స్కూల్ డ్రాపవుట్లను తిరిగి తీసుకురావటం, ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు బోధన అంశాలపై దృష్టి పెట్టామని తెలిపారు. అనంతరం మేం సందర్శించిన 'హీల్' ప్యారడైజ్ స్కూల్‌లో ప్రజాస్వామిక పద్ధతుల్లో విద్యాబోధన ఉంది. క్యాంపస్‌ని విద్యార్థులే నిర్వహిస్తారు, విద్యార్థులే ట్యూటర్లుగా వ్యవహరిస్తుంటారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్లు వాటిలో భాగస్వాములవుతారు. పరిశీలనా శక్తిని, సంక్లిష్ట పరిస్థితుల్లో ప్రతికూల ధోరణితో వ్యవహరించకుండా సానుకూల దృక్పథంతో పరిష్కారంలో భాగమయ్యే సామాజిక నాయకత్వ లక్షణాల్ని ఇక్కడ పెంపొందిస్తున్నారు. లివింగ్ వికాస విద్యావనమైతే విజయవాడ రిషీవ్యాలీలా ఉంది. చైతన్యవంతమైన కమ్యూనిటీ నివసించే గ్రామీణ వాతావరణం అక్కడ నెలకొంది. విద్యార్థులు 6 గంటలు మాత్రమే పాఠ్యాంశాలకు వెచ్చిస్తారు. అందులో కూడా 2 గంటల్ని 'సెల్ఫ్ టైమ్'గా నచ్చినట్లు గడిపే అవకాశం. ఆటలు, వ్యవసాయ పనులు, విద్యార్థి మంత్రివర్గం, ఫిర్యాదుల విభాగం ఇలా మానవ సమాజావసరాలన్నిటినీ విద్యార్థులు తెలుసుకునే విద్యను ఇక్కడ పంచుతున్నారు.

విద్య కోసం పనిచేస్తున్నవారితో చర్చల్లో మాస్ కాపీయింగ్, నూటికి 90 మార్కులు వస్తే సంతోషించకుండా ఆ పది ఎందుకు తగ్గాయి అని తల్లిదండ్రుల్లో, పిల్లల్లో కుంగిపోయే ధోరణి గురించి ప్రస్తావన వచ్చింది. మన మూల్యాంకన పద్ధతిలో, భాషల్లో ఏరకమైన స్పెల్లింగ్ పొరపాట్లు ఉన్నా 1/8 మార్కుని మాత్రమే కత్తిరించాలి. ఒక స్పెల్లింగ్ పొరపాటు మళ్లీ మళ్లీ వచ్చినా ఒకే



పొరపాటు కింద మాత్రమే పరిగణించాలి. మహా అయితే స్పెల్లింగ్ పొరపాటుకి 1 మార్కుని తీసేయాలి. విద్యార్థికి కాన్సెప్ట్ అర్థమయితే, సగానికిపైగా మార్కుల్ని ఇవ్వాలి. నూరు శాతం లేదా ఆ దరిదాపుల్లో మార్కుల్ని ఇచ్చే ఆనవాయితీ వల్ల, విద్యార్థులకు తమ సామర్థ్యం గురించిన వాస్తవ విశ్లేషణ కొరవడుతోందని, దీనివల్ల తల్లిదండ్రుల్లో, ఉపాధ్యాయుల్లో, పిల్లల్లో అంచనాలు పెరిగి విద్యార్థుల్లో ఒత్తిడికి, ఆత్మహత్యలకు దారితీస్తోందని వివరించారు.

క్లాస్‌రూం బోధన కంటే సంబంధిత పని ద్వారా నేర్చుకోవటం కాన్సెప్ట్‌లో 'అభ్యాస ఫౌండేషన్' విద్యను అందిస్తోంది. క్షేత్రస్థాయిలో లేదా టూల్స్ ద్వారా విద్యార్థులు కాన్సెప్ట్‌ను నేర్చుకుంటున్నారు. వరి సాగు గురించి తెలుసుకోవటానికి ధాన్యం పండించటం వంటి పద్ధతుల్లో అన్నమాట.

కల్వకుర్తిలోని 'అక్షర విద్యావనం' వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తోంది. ఇక్కడ దాదాపు 50 మంది విద్యార్థులున్నారు. ఉపాధ్యాయులనేవాళ్లు ప్రత్యేకించి లేరు. పాఠ్య పుస్తకాలు చదవడం, లెక్కల్ని పరిష్కరించడం, ప్రశ్నాపత్రాల్ని తయారుచేయడం మొత్తం విద్యార్థులే చేసుకుంటారు. విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి బృందాలుగా ఏర్పాటు చేస్తారు. ఒకరికొకరు చదువులో సాయం చేసుకుంటారు. ఎవరికీ రాని అంశాలు, లెక్కలు ఉంటే గైడ్ సాయం చేస్తారు. 'చదవటం ద్వారా రాయటం, వినడం ద్వారా మాట్లాడటం నేర్చుకోవచ్చు' అనే సూత్రంతో భాషల్ని నేర్పిస్తారు. పరీక్షలంటే ఏ మాత్రం భయంలేని రీతిలో మూల్యాంకన పద్ధతులున్నాయి. హైదరాబాద్‌లోని ప్రజ్ఞ మాంటిస్సోరి స్కూలు 55 శాతం ప్రాక్టికల్ అనుభవాలతో బోధన చేస్తోంది. ఇలా పదవ తరగతి వరకూ మాంటిస్సోరి పద్ధతులతో బోధన చేస్తున్న స్కూలు దేశంలో ఇదొక్కటే.

తమకు వీలున్నట్లు, వీలైన రీతిలో, నచ్చిన అంశాన్ని నేర్చుకునే రీతిలో హైదరాబాద్‌లోని 'అహం లెర్నింగ్ హబ్' వేలాది ఐచ్ఛికాలతో 'పర్సనలైజ్డ్ విద్యాబోధనను అందిస్తోంది. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి విద్యార్థికీ వ్యక్తిగత అభ్యసన అవసరాల

నుంచీ ట్యూషన్‌లా బోధననందిస్తుంది. ఒక పిల్ల, పిల్లవాడిని అడ్మిట్ చేసుకునే ముందు అంచనా పరీక్ష పెడతారు. అందులో ఫలితాల్ని బట్టి పరిజ్ఞాన స్థాయిని అంచనా వేసి, దానికి తగ్గట్టు బోధనా లక్ష్యాల్ని నిర్ణయిస్తారు. తల్లిదండ్రులు అంగీకరిస్తే అడ్మిషన్ ఇస్తారు. ఇంటి వద్ద బోధించే వారు కూడా ఇందులో ఉన్నారు. భారత్‌లో విద్యాఅసమానతల్ని తొలగించేందుకుగాను పేద పిల్లలకు సృజనాత్మక బోధననందించే లక్ష్యంతో ప్రారంభమైన టీచ్ ఫర్ ఇండియా (టీఎఫ్ఐ)లో పనిచేసే అవకాశాన్ని కూడా శిక్షణనిచ్చి ఇందులో కల్పిస్తున్నారు.

మొత్తంగా తెలుగు రాష్ట్రాల్లో 80 శాతం మంది విద్యార్థులు పొందుతున్న చదువుకు, పైన స్కూళ్లలో చెబుతున్న చదువుకు ఎంతో తేడా ఉంది. ఈ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకూ మంచి మార్కులు, గ్రేడ్లు వస్తున్నాయి. కానీ మార్కులతో పాటు మంచి చదువు కూడా వస్తోంది. చదువు లక్ష్యమైన శాస్త్రీయ దృక్పథం, తర్కం, విశ్లేషణ, సమాజాన్ని గురించి ఆలోచించటం, సంతోషంగా బతకటం, సంతోషాన్ని పంచటం వీరికి అలవడుతున్నాయి. 'సంపద సృష్టి అంటే ఎలాగైనా డబ్బు సంపాదించటం కాదు.. సమాజానికి ఉపయోగపడే పనిచేస్తూ ఎదగటం' అని వీరు అర్థం చేసుకుంటున్నారు. కానీ మనలో ఎక్కువమందిమి ఏం చేస్తున్నాం? కేవలం మార్కులు, ర్యాంకులే చదువు అనుకుని మన ఆనందాల్ని, బిడ్డల భవిష్యత్తును, దేశాభివృద్ధిని ఛిన్నాభిన్నం చేస్తున్నాం. విద్యలో సక్సెస్‌కి మనం నిర్వచనాన్ని మార్చుకుంటే చాలు.. మనం హాయిగా బతగ్గలం, మన పిల్లలకు ఆనందంగా జీవించే గొప్ప భవిష్యత్తుని ఇవ్వగలం, భారతదేశాన్ని సమున్నత దేశంగా అభివృద్ధి చేయగలం! విద్యలో నాణ్యతను పెంచేందుకు కీలకమార్పుల్ని ఎక్కడెక్కడ తేవాలో కొన్నిటిని విద్యాయాత్ర ముందుకు తెచ్చింది. పరిశీలన, ప్రశ్నల ద్వారా బోధన, పర్యవేక్షణ, జవాబుదారీతనం, అభ్యాసం, మాస్ కాపీయింగ్‌లేని పరీక్షలు, పరీక్షా పద్ధతులు, పరీక్షా పత్రాల మూల్యాంకనం.. ఇలా అనేకం ఉన్నాయి. ఇవన్నీ ఆచరణసాధ్యమైనవి, ఖర్చు లేకుండా చేయగలిగినవి. పిల్లల చదువు కోసం ఎన్నో త్యాగాలు చేస్తున్న మనకు ఇవి పెద్ద విషయాలే కావు. కావలసిందల్లా.. విద్యలో సక్సెస్ అంటే ఏమిటో మనం గుర్తించి పునర్నిర్వచించటమే.

అందరికీ విద్య, ఆరోగ్యాలను అందించటం ప్రభుత్వాల బాధ్యత. కానీ యుద్ధాన్ని సైన్యాధ్యక్షులకు వదిలేసి ప్రభువులు నిద్రపోతే ఏం జరుగుతుందో.. అలాగే ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజలు విద్యను పాలకులకు వదిలేయటం మూలంగా తరతరాలుగా నష్టపోతూనే ఉన్నారు. విద్యాయాత్రలోని అంశాలేమిటో కూడా అర్థం చేసుకోలేని వారు అడుగడుగునా ఉన్న దుస్థితి ఏర్పడింది. దీన్ని బాగు చేసుకోవటానికి మనం ముందుకొస్తేనే పాలకులు మారతారు. కనీసం ఎన్నికల్లో గెలవటం కోసమైనా వారు మన మాట వినకతప్పదు. తాత్కాలిక తాయిలాల్లో, పథకాల్లో దేశంలోనే గొప్ప ప్రమాణాల్ని నెలకొల్పారుగానీ.. మాక్కావలసింది విద్యలో మంచి ప్రమాణాలు అని తెలుగు రాష్ట్రాల పాలకుల్ని డిమాండ్ చేయాలి. ఓబుల్‌రెడ్డి స్కూల్ లాంటి చోట తమ పిల్లల్ని చదివించాలని అనుకోని తల్లిదండ్రులు హైదరాబాద్ లోనే కాదు, తెలుగునాట ఉండరంటే అతిశయోక్తి కాదు. కానీ ఆ స్కూల్‌లో ఒక్కో విద్యార్థికి తల్లిదండ్రులు కడుతున్న ఫీజు కన్నా.. ఏపీ, తెలంగాణల్లో ప్రభుత్వాలు ఒక్కో విద్యార్థి మీద చేస్తున్న వ్యయం చాలా ఎక్కువ. అలాగే తెలుగునాట మనకు ఒక్కో టీచర్‌కు విద్యార్థుల సంఖ్య 18 కాగా, ఓబుల్‌రెడ్డి స్కూల్‌లో ఆ సంఖ్య 25. ప్రభుత్వ టీచర్ల కన్నా ఓబుల్‌రెడ్డిలో జీతాలు కూడా తక్కువే. అయినా ఆ స్కూల్‌లో మంచి విద్య అందుతోంది. ఒక్కో విద్యార్థి మీదా గరిష్ఠంగా రూ. 90,000 దాకా ఖర్చు చేస్తున్నా ఎందుకు పనికొచ్చే చదువు రావటం లేదు? అని ప్రభుత్వాల్ని ప్రశ్నించాలి.

హైదరాబాద్ ఓబుల్‌రెడ్డి స్కూల్‌లోనే వారం రోజుల విద్యాయాత్ర ముగింపు కార్యక్రమం జరిగింది. జేపీ, తెలంగాణలో విద్యాప్రమాణాల్ని పెంచటానికి ప్రశంసనీయ కృషి చేసిన సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. విద్యాయాత్రలో మరింతమంది ఛాంపియన్లను భాగస్వాముల్ని చేయాలని, తరువాతి దశలో జిల్లా, గ్రామం స్థాయిలో నిర్వహించాలని భావిస్తున్నాం. విద్యలో మార్పు తెచ్చే హీరోలుగా పనిచేసే వారితో 15–20 బృందాలను తయారుచేయాలన్నది లక్ష్యం. సమాజం స్పందించేదాన్ని బట్టి. దీని తర్వాత అందరికీ ఆరోగ్యం కోసం కూడా ఇదే తరహాలో ఛాంపియన్లను తయారుచేస్తాం. తొలిదశ విద్యాయాత్ర ప్రాథమిక నివేదిక ఇది. త్వరలో పూర్తి స్థాయి నివేదికను ఇంకొన్ని యాత్రల అధ్యయనాలతో కూడా కలిపి ప్రజల ముందుంచుతాం, ప్రభుత్వాలకూ అందిస్తాం. 'ఈ దశలో అదనపు నిధులేమీ అక్కర్లేదు. చేస్తున్న ప్రతి రూపాయి ఖర్చూ సద్వినియోగమయ్యేలా చేయండి. ఇందుకు సాంకేతికతను కూడా గరిష్ఠంగా వినియోగించండి. పాఠశాల విద్యలో నాణ్యమైన ప్రమాణాల్ని అందించండి' అని ప్రభుత్వాలతో కుస్తీ పట్టటమే మనం చేయాల్సింది. నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే కాబట్టి.. ప్రభుత్వ నిధుల వ్యయం తీరు, విధానాలు మారితే సర్కారీ బడులతోపాటు, మంచి చదువును అందిస్తున్నామని తల్లిదండ్రుల్లో భ్రమలు కల్పిస్తూ దండుకుంటున్న పలు ప్రైవేటు స్కూళ్లు కూడా దారిలోకొస్తాయి. ఉండటమో, ఊడటమో తేల్చుకుంటాయి. మొత్తంగా తెలుగునాట ప్రతి బిడ్డా ప్రపంచంలో ఎక్కడైనా తలెత్తుకుని బతకగలిగే విద్యావకాశాల్ని మాత్రం అందుకోగలుగుతుంది.

## నాణ్యమైన విద్య కోసం ఏపీ, తెలంగాణల్లో ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా

# 'ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్ 2019'

## విద్యాయాత్రను రిషీవ్యాలీ స్కూల్‌లో ప్రారంభించిన జేపీ



కేంద్రంలో, తెలుగు రాష్ట్రాల్లో పాలకులు చురుగ్గా పనిచేస్తున్నారని, కానీ ప్రజలు, సమాజం ఎదగటానికి అవసరమైన మౌలిక రంగాల్లో ఫలితాలు సాధించటంలో మాత్రం విఫలమవుతున్నారని లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్-ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. అందుకే కీలకమైన విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాలు, వ్యవసాయరంగంలో మార్పులు తెచ్చేందుకు మరో పోరాటానికి శ్రీకారం చుట్టామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో విద్యలో సంస్కరణలు తీసుకొచ్చేందుకు ప్రజాస్వామ్యవాదులతో కలిసి విద్యాయాత్ర చేస్తున్నట్లు వివరించారు.

నాణ్యమైన విద్య ప్రతి బిడ్డకూ అందేలా విద్యారంగంలో సంస్కరణలు తెచ్చేందుకు నాయకత్వాన్ని అందిస్తామంటూ ముందుకొచ్చిన అనుభవం, ఆర్తి గల 25 మంది విద్యా ఛాంపియన్లతో చిత్తూరు జిల్లా మదనపల్లె వద్దనున్న రిషీవ్యాలీ స్కూల్‌లో విద్యాయాత్రను జేపీ ప్రారంభించారు. 'ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్ 2019' పేరుతో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి.

ఈ సందర్భంగా జేపీ మీడియాతో మాట్లాడుతూ, సమాజంలో విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాలు, వ్యవసాయం కీలక రంగాలన్నారు. వీటిలో మార్పులకు నిష్ఠాతులు, నాయకులతోపాటు ఆసక్తిగల ప్రముఖులతో కలిసి పనిచేస్తున్నామన్నారు. వీరంతా స్వచ్ఛందంగా పనిచేస్తారన్నారు. విద్యాయాత్రలో భాగంగా 'పిల్లలకు మంచి విద్యను ఎలా అందించడం'పై పేరొందిన స్కూళ్లలో అమలవుతున్న విధానాలను, పద్ధతులను, ప్రత్యేకతలను పరిశీలించి చర్చిస్తామన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యార్థుల కోసం అమ్మ ఒడి వంటి పథకాన్ని కూడా అమలు చేస్తోందని, మొత్తంగా రాష్ట్రంలో ఉన్న ఒక్కో విద్యార్థి మీదా ఏటా రూ.85,000 నుంచి 90,000 వరకూ వెచ్చిస్తోందని జేపీ అన్నారు. తెలంగాణలో కూడా కాస్త అటూఇటుగా ఇదే రీతిలో ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. ఏపీలో 37 లక్షల మంది, తెలంగాణలో 26-27 లక్షల మంది స్కూలు పిల్లలున్నారని, కానీ ఇంత డబ్బు ప్రభుత్వాలు వెచ్చిస్తున్నా వారిలో నూటికి 80 మందికి కనీస ప్రమాణాలతో కూడిన విద్య అందటం లేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులున్నారు, అనేక సౌకర్యాలను కల్పిస్తున్నారు.. అయినా అత్యధికులకు చదువు రావటం లేదన్నారు. తల్లిదండ్రులు అప్పోసొప్పో చేసో, అవసరాలు మానుకునో పిల్లల విద్య కోసం లక్షలు ఖర్చు పెట్టి ప్రైవేటులో చదివిస్తున్నా.. అక్కడా అనేక చోట్ల పెద్దగా చదువు రావటం లేదన్నారు. 14-18 సంవత్సరాల మధ్య ఈడు పిల్లల్లో 50 శాతం మంది పిల్లలకు

గడియారం చూసి టైమ్ చెప్పటం చేతగావటం లేదన్నారు. ఈ సంక్షోభానికి పరిష్కారం చూపాలని లోక్‌సత్తా ఆలోచించి ముందుకొచ్చిందన్నారు. నాణ్యమైన విద్యను అందరికీ అందేలా చేయటం లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రాజెక్టులో ఆసక్తి, అనుభవం ఉన్నవారు భాగస్వాములై మార్పు కోసం పనిచేయాలని కోరారు.

రిషీవ్యాలీ పాఠశాలలో రూరల్ ఎడ్యుకేషన్ కేంద్రాలను నిర్వహిస్తున్నారని, కొన్ని పాఠశాలలకు ప్రభుత్వం దీన్ని ఆనందలహరి అభ్యసన కార్యక్రమంగా విస్తరించటం అభినందనీయమని, ఇటువంటి అనుభవాలను పరిగణలోకి తీసుకుని విద్యావ్యవస్థను నాణ్యమైనదిగా తీర్చిదిద్దాలని జేపీ అన్నారు. కొన్ని తరాలు నష్టపోకుండా వేగంగా చేపట్టాల్సిన చర్యలివి, కానీ మన చర్చ తాత్కాలిక తాయిలాలు, భావోద్రేకాల చుట్టూనే తిరుగుతోంది.. అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి 18 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలని, ఇది తెలుగు రాష్ట్రాల్లో అమలు జరుగుతుందా అన్నది ప్రశ్నార్థకంగా మారిందన్నారు. విద్యార్థులకు నిర్వహించే పరీక్షలు న ా ం ౕ ం ల ే ని వి ౧ా తయారయ్యాయన్నారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ చేయించి మన విద్యార్థుల భవిష్యత్తుపై మనల్ని మనమే మోసం చేసుకుంటున్నామన్నారు. విద్యారంగ వైఫల్యం దేశవ్యాప్తంగా ఉన్నా, తెలుగు రాష్ట్రాల్లో మరీ ఎక్కువగా ఉందని మేలుకోవాలని అన్నారు.

## ఆనందలహరి అభ్యసన పాఠశాల సందర్శన

రిషీవ్యాలీ స్కూలు, అనుబంధ రివర్ పాఠశాలల్లో విద్యాయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం.. పీటీఎం మండలంలో ఆనందలహరి అభ్యసన అమలవుతున్న మద్దయ్యగారిపల్లె పాఠశాలను జేపీ సందర్శించారు. కార్యక్రమాన్ని చక్కగా అమలు చేస్తున్నందుకు ఎంఈవో నారాయణ, రిసోర్స్ పర్సన్లు రాంప్రసాద్, శ్రీరాములు, హెచ్ఎం విజయలక్ష్మి తదితరుల్ని అభినందించారు. రిషీవ్యాలీలో విద్యావిధానంతోపాటు పరిసరాలు కూడా బాగున్నాయని, పర్యావరణం మీద కూడా పాఠశాలలు దృష్టి పెట్టాలని అన్నారు.

## అవినీతిరహిత సమాజం కోసం జగన్ ప్రయత్నాన్ని స్వాగతిస్తున్నా

అవినీతిరహిత సమాజం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేస్తున్న ప్రయత్నాన్ని తాను స్వాగతిస్తున్నానని జేపీ అన్నారు. భారతదేశంలో 65 శాతం కుటుంబాలు ఏదో ఒక పనికి లంచం ఇవ్వక తప్పటం లేదన్నారు. అవినీతి క్యాన్సర్ వంటిదని, దీనికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు లంచాలు, వేధింపులు లేకుండా నిర్దిష్ట గడువులోగా సేవలు అందించేలా లోక్‌సత్తా ఎన్నో ఏళ్ల క్రితమే హక్కుగా పౌర సేవల చట్టం బిల్లును రూపొందించిందని, పౌర సేవలకు ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కొన్ని మునిసిపల్ సేవలకు ఈ చట్టం తెచ్చారని అన్నారు. ఇందుకు తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించాలన్నారు. ఇదే చట్టాన్ని ఏపీలో కూడా అమల్లోకి తేవాలన్నారు. పౌర సేవల చట్టం నమూనాను ఇప్పటికే వైఎస్ జగన్‌కు లోక్‌సత్తా పంపిందన్నారు. ప్రతి పనికీ గడువు పెట్టి, ఆలోగా జరగకపోతే అధికారిపై జరిమానా విధించటం వల్ల జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. ప్రజలకు వేగంగా పనులు జరుగుతాయన్నారు. ప్రజలు కట్టిన పన్నుల డబ్బుతో ఉద్యోగులకు



జీతాలిస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు ఫీజులు చెల్లిస్తున్నారని.. హక్కుగా పౌర సేవలు పొందే అధికారం వారికుందని అన్నారు. మెరుగైన సమాజం ఏర్పడా లంటే ప్రభుత్వాలు, ప్రజలు కూడా మార్పుకు సహకరిం చాలన్నారు. విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాలు, వ్యవసాయ రంగాల్లో మార్పు కోసం ఆసక్తి, అనుభవం, నైపుణ్యం గల వారంతా ముందుకొచ్చి భాగస్వాములు కావాలని జేపీ పిలుపు నిచ్చారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నేతలు కల్లూరి బాలసుబ్రహ్మణ్యం, వెంకటరమణ బాబు, అనంతపురం జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప, శనివారపు జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయికి మన పాఠశాల విద్య

- అదే మా లక్ష్యంజ
- గడియారంలో టైం చెప్పలేని విద్యార్థులున్నారు
- కాపీయింగ్, బట్టీకొట్టే విధానం మారాలి
- విద్య బాగుపడాలనే తపన ఉన్నవారెందరో
- ప్రముఖ సంస్థల సహకారమూ తీసుకుంటాం
- తొలి అడుగు మంచి స్ఫూర్తినిచ్చింది.. స్కూళ్లపై ప్రభుత్వం డబ్బు ఖర్చు పెడుతోంది తప్ప ఫలితాలపై శ్రద్ధ చూపటం లేదు
- పాఠశాల విద్యాయాత్ర అనంతరం నిర్దిష్ట ప్రణాళికలు



'ఏటా 15 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టా అందుకుంటున్నారు. వీరిలో ఉద్యోగాలు వస్తున్నది ఎందరికి? చదువుకుంటున్నవారిలో 14-18 సంవత్సరాల వయసున్నవారిలో ఇప్పటికీ గడియారం చూసి టైం చెప్పలేని వారున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో టీచర్లుంటే విద్యార్థులుండరు.. విద్యార్థులుంటే టీచర్లుండరు. ప్రైవేటు విద్యాసంస్థల్లో బట్టీ చదువులున్నాయి. దీంతో పిల్లలు ఎటూకాకుండా పోతున్నారు. మన విద్య, ముఖ్యంగా పాఠశాల విద్య ప్రపంచస్థాయి ప్రమాణాలను అందుకోవాలి. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా బతకగలను అనే ధీమాను ఇవ్వగలగాలి. ఇందుకోసం మేము 'ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్-2019' విద్యాయాత్రను నిర్వహిస్తున్నాం' అని లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తెలిపారు. చిత్తూరు జిల్లా రిషివ్యాలీలో విద్యాయాత్రను ప్రారంభించిన అనంతరం కడప వచ్చిన జేపీ.. ప్రస్తుత విద్యావ్యవస్థ, అధ్వాన్న స్కూలు చదువులు, ప్రభుత్వం డబ్బు ఖర్చు చేస్తున్నా విద్యార్థులకు కలగని ప్రయోజనం తదితర అంశాలపై 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

**(?) ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్-2019 ప్రధాన ఉద్దేశం ఏమిటి**

జేపీ: ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు పాఠశాల విద్య కోసం ఏటా రూ.55,000 కోట్లు ఖర్చు పెడుతున్నాయి. అమ్మ ఒడి, పెన్షన్లు తదితర పథకాలను పరిగణలోకి తీసుకుంటే తలసరిగా ఒక్కో విద్యార్థి మీద ఏపీ ప్రభుత్వం రూ.80,000 నుంచి 90,000 దాకా ఖర్చు చేస్తోంది. ఒక బిడ్డపై ప్రతి సంవత్సరం ఇంత సొమ్ము ఖర్చు పెడుతున్నా.. చదువులు ఏ విధంగా ఉన్నాయని ప్రశ్నించుకుంటే- మనల్ని మనం మోసం చేసుకుంటున్నామని తెలుస్తుంది. మాస్‌కాపీయింగ్ చేయిస్తూ 90 నుంచి 95 శాతం ఫలితాలు సాధిస్తున్నట్లు ప్రకటిస్తున్నారు. పిల్లలు తమలోని ప్రతిభను ఎలా ప్రదర్శిస్తున్నారో గుర్తించే పద్ధతి లేదు. డబ్బు ఖర్చు పెడుతున్నా ప్రభుత్వాలు విద్యాప్రమాణాలు పెంచలేకపోతున్నాయి. తల్లిదండ్రులు త్యాగాలు చేస్తున్నారు, శక్తికి మించి బిడ్డల చదువుల కోసం ఖర్చు పెడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు బాగా లేవు అనుకుని, ప్రైవేటు స్కూళ్లకు పంపుతున్నారు. కానీ అక్కడా విద్యాప్రమాణాలు పెంచకుండా బట్టీ పట్టే విధానంతో పరీక్షలు రాయిస్తున్నారు. ఇలాంటి వాటన్నిటినీ పరిగణలోకి తీసుకొని విద్యాప్రమాణాల పెంపు, ఆ దిశగా ప్రజల్లో చైతన్యం కోసం ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్-2019 విద్యాయాత్రను చేపట్టాం.

**(?) ఈ విద్యాయాత్రలో ఎవరెవరి భాగస్వామ్యం ఉంటుంది**

సమాజం విద్యను గౌరవిస్తుంది. విద్యపై ఆసక్తి ఉన్నవారు, విద్య బాగుపడాలనే తపన ఉన్నవారు, విద్యలో నిష్ణాతులైనవారు.. వీరందరినీ ఒక ప్లాట్‌ఫాం పైకి తీసుకొచ్చి ఆర్మీ ఛాంపియన్లుగా తయారుచేస్తున్నాం. ప్రభుత్వ సాయంతో సంబంధం లేకుండా పనికివచ్చే విద్యను అందించాలన్నది ఈ ఆర్మీ ఛాంపియన్ల ఆలోచన. ప్రభుత్వంతో కలిసి పనిచేసేవారికి కూడా భాగస్వామ్యం ఉంటుంది. ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ప్రజాస్వామ్య పీఠం - ఎఫ్‌డీఆర్) చొరవతో ఈ కార్యక్రమానికి జులై 24న శ్రీకారం చుట్టాం. 25న పూర్తిస్థాయిలో విద్యాయాత్ర

మొదలైంది. తెలుగునాట విద్య బాగుపడాలని తపన ఉన్నవారు డబ్బునేది ప్రామాణికం కాకుండా సదస్సులు, యాత్రల ద్వారా విద్యాప్రమాణాల పెంపు యజ్ఞంలో భాగస్వాములవుతారు. పేరుకు చదువుకుంటే లాభం లేదు.. నాణ్యమైన విద్య కావాలి అనే అంశంపై పాఠశాల విద్యార్థులు, ప్రజలకు ఓ ఉద్యమంలా అవగాహన కల్పిస్తాం.

(?) ఎలాంటి సహకారం తీసుకొని ముందుకు నడుస్తారు

ఈ ప్లాట్‌ఫాంలో ఉన్నవారి పేర్లు చెప్పలేం. తెలంగాణలో వందేమాతరం ఫౌండేషన్ సంస్థ, మదనపల్లె వద్ద ఉన్న రిషీవ్యాలీ స్కూళ్లు వంటి ఎన్నో ప్రముఖ సంస్థలు సహకారం అందిస్తున్నాయి. ఇంకా అజ్ఞాతంలో ఉన్నవారు కూడా ఈ ప్లాట్‌ఫాంలో పనిచేస్తారు. రిటైర్ అయిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా ముందుకు వస్తున్నారు. విద్యాయాత్ర వల్ల విద్యా ప్రమాణాల పెంపు కోసం సూచనలు, సలహాలు స్వీకరిస్తాం. ప్రభుత్వం చెబుతున్న మంచి ఫలితాలు రావాలన్నది మా ఆలోచన. రిషీవ్యాలీ ఆధ్వర్యంలో రూరల్ ఎడ్యుకేషన్ సెంటర్ ఏర్పాటు చేసి ఏపీ ప్రభుత్వం మండలంలో రెండు పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు 1400 స్కూళ్లను ఎంపిక చేసింది. వీటన్నింటినీ అనుసంధానం చేసి ప్రమాణాల పెంపు దిశగా పనిచేస్తున్నారు.

**(?) మన విద్యాప్రమాణాలు అంత అధ్వాన్నంగా ఉన్నాయా**

ఆమధ్య 74 దేశాల మధ్య విద్యాప్రమాణాలపై ఒక పెద్ద సర్వే జరిగింది. అందులో మనం చివరి నుంచి రెండో స్థానంలో, 73వ స్థానంలో ఉన్నాం. సమర్థులుగా రాణిస్తున్న సుందర్ పిచాయ్‌లాంటి కొద్దిమంది పేర్లను డబ్బా కొట్టుకోవటం తప్ప.. అత్యధికులకు చదువు అధ్వాన్నంగా ఉన్న సంగతిని మనం గుర్తించటం లేదు. ఉన్నత పాఠశాల విద్య చదువుతున్నవారిలో 50 శాతం మందికి గడియారంలో ముళ్లు చూసి టైం చెప్పటం చేతకావటం లేదు. ఇలాంటి వారికి ఉద్యోగాలు ఎలా వస్తాయి? నూటికి 80 మంది విద్యార్థులకు తూతూ మంత్రంగానే విద్య

## జేపీ ప్రయత్నాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకం



ఉత్తమ విద్యావిధానాలు ఎక్కడున్నా వాటిని పాఠశాలలు అందిపుచ్చుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) వేదికగా డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ చేస్తున్న ప్రయత్నాలు భవిష్యత్తు తరాలకు మార్గదర్శకమన్నారు. ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్ పేరుతో ఎఫ్‌డీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాయాత్ర తొలిదశ ముగింపు సందర్భంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఓబుల్‌రెడ్డి స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రత్యేక ఆహ్వానితునిగా పాల్గొన్నారు. ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్ మార్గదర్శి డాక్టర్ జేపీ మాట్లాడుతూ, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాల్లో దేశంలో ఉత్తమ విధానాలను తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. వివిధ రంగాలకు చెందిన 25 మంది నాలుగు బృందాలుగా ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్ తొలిదశ యాత్రలో పాల్గొన్నారని, తెలంగాణ, ఏపీల్లోని పాఠశాలల్లో అత్యుత్తమ విద్యాపద్ధతుల్ని అన్వేషించామని వివరించారు. ఇలాంటి ఉత్తమ విధానాలను ఒకచోటికి చేర్చి మిగిలిన పాఠశాలలకు వివరిస్తామన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనం వివరాలను బృందంలోని సభ్యులు కార్యక్రమానికి హాజరైన వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లకు వివరించారు. అనంతరం ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్‌లో పాల్గొన్నవారికి సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ఓబుల్‌రెడ్డి పాఠశాల ఛైర్మన్ ఎస్వీ రావు, ప్రిన్సిపాల్ లతా శంకర్, ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్ సమన్వయకర్త వెలమాటి మనోహరి, ప్రితి బన్సాల్, గాయత్రి మేకా, అజిత, శమంతిక తదితరులు పాల్గొన్నారు.

అందుకుంటున్నారు. ఏటా 15 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టా అందుకుంటున్నారు. వీరిలో ఎందరు ఉద్యోగాలను సాధిస్తున్నారో చూస్తే, మన విద్యాప్రమాణాలు ఎలా ఉన్నాయో అర్థమవుతుంది. మన పాఠశాల విద్య బాగుపడాలి. మంచి ఆదాయాన్నిచ్చే ఉపాధికి అదే పునాది. ప్రపంచస్థాయిలోకి మన విద్యాప్రమాణాలు చేరినప్పుడే దేశం, రాష్ట్రం బాగుపడతాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో విద్యాప్రమాణాలు ప్రపంచస్థాయికి చేరాలన్నది నా ఆలోచన. చదువులో కులాలు, పార్టీలు అన్నవాటికి తావివ్వకూడదు. చదువు బాగుపడితే అదే చాలు.

(?) ఎన్ని రోజుల పాటు విద్యాయాత్ర కొనసాగుతుంది

విద్యాయాత్ర తొలి దశ జులై 30న ముగిశాక మరో గ్రూప్ జిల్లా, గ్రామాల్లో సందర్శిస్తుంది. డబ్బు కాదు, విద్యాప్రమాణాలు పెంచాలన్నదే మా ఆలోచన. కోటీశ్వరుల పిల్లల తరహాలో నిరుపేదల పిల్లలు నాణ్యమైన విద్యను అభ్యసించాలి. ఈ యాత్రలో గుర్తించిన పలు నిర్దిష్టమైన అంశాలను ప్రభుత్వాలకు అందిస్తాం.

**(?) మీ తొలి అడుగుపై స్పందన**

ఈ యాత్రలో భాగంగా రిషీవ్యాలీలో తొలి అడుగుపెట్టాం. ఎంతో స్ఫూర్తినిచ్చింది. నిష్ణాతులు, ఔపోశన పట్టిన మేధావులు ఉన్నారు. యువత ఐటీ తదితర రంగాల్లో ఉన్నత స్థాయిలో, విదేశాల్లో, ఎన్నో సంస్థల్లో ఉన్నారు. వారిలో చదువు బాగుపడాలన్న తపన ఉండటంతో విద్యాభివృద్ధికి ముందుకొస్తున్నారు. ఇది ఎంతో అభినందనీయ విషయం. ఇది ఒకరోజుతో పూర్తయ్యే అంశం కాదు. విద్యాప్రమాణాలు మెరుగుపడే వరకు ఇలాంటి సదస్సులు, విద్యాయాత్రలు ఎంతో అవసరం.

(?) విద్యాభివృద్ధికి ప్రభుత్వం కోట్లు ఖర్చు పెడుతోంది కదా

విద్యాభివృద్ధికి ప్రభుత్వాలు కోట్లు ఖర్చు పెడుతున్నాయి. ఆరోగ్యరంగంలో ఫలితాలొస్తున్నా ఖర్చు చేయటం లేదు, విద్యలో ఖర్చు చేస్తున్నా ఫలితాలు రావటం లేదు. విద్యాప్రమాణాలు పెరగకపోవటంతో ప్రస్తుతం కాపీ కొట్టడం, బట్టీ పట్టి పరీక్షలు రాయడం జరుగుతోంది. బుర్ర ఉపయోగించి పరీక్షలు రాసే పరిస్థితి లేదు. టీచర్లు, పిల్లల నిష్పత్తిని పరిశీలిస్తే 18 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలి. కాస్త అటూఇటుగానైనా ఆ పరిస్థితులు పాఠశాలల్లో కనిపించడం లేదు. విద్యార్థులుంటే టీచర్లుండరు, టీచర్లుంటే విద్యార్థులుండరు. ఇవన్నీ సరిచేసినప్పుడే విద్యాప్రమాణాలు పెరుగుతాయి. వ్యక్తులు, వ్యవస్థలు అందరూ కూడా విద్యాప్రమాణాలపై దృష్టి పెట్టాలి. గతంలో పాఠశాలలను తరచూ అధికారులు తనిఖీ చేసేవారు. కానీ ఈవేళ చదువెలా వస్తుందో పరిశీలించేవారు, అడిగేవారు లేరు. విద్యాభివృద్ధి పేరుతో ప్రజల డబ్బు ఖర్చయిపోతోంది తప్ప.. విద్యాప్రమాణాలు పెరగడం లేదన్నది వాస్తవం. విద్యాయాత్రలో గుర్తించిన వాటిలో నిర్దిష్టమైన అంశాలను పరిష్కారాలతో ప్రభుత్వానికి అందిస్తాం. వాటిని అమలు చేయాలని కూడా కోరతాం.

# మార్పుకోసం వైకల్యాన్నీ అధిగమించాలి, సంఘటితంగా కృషి చేయాలి: జేపీ

సమాజంలో మార్పు కోసం ప్రజలు సంఘటితంగా కృషి చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ తార్నాక విజయపురి కాలనీలోని మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో వాయిస్ ఆఫ్ వీఐపీ ఆధ్వర్యంలో 'బ్లూమ్ 2019' కల్చరల్ ఫెస్ట్ ఫర్ విజువల్లీ ఇంపెయిర్డ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

సమాజంలో అన్ని అవకాశాలూ ఉన్నా జీవితాన్ని వృథా చేసుకుంటున్నవారిని చూస్తున్నామని, కానీ కొందరు ఎన్ని సమస్యలు, శారీరక లోపాలు ఉన్నా సవాలుగా తీసుకుని వాటి అధిగమిస్తూ ఎదుగుతున్నారని జేపీ అన్నారు. అలాంటివారి కోసం 'అందరితోపాటు ఎదగాలి' అనే భావంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఎంతో గొప్పదని అన్నారు. వివిధ కారణాల వల్ల అంధత్వానికి గురైనా కూడా వాటిని అధిగమించి శక్తిసామర్థ్యాలు వికసించేలా కష్టపడి పనిచేస్తున్న అనిల్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంధుడై ఉండి కూడా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేయడం గొప్ప విషయమన్నారు. ప్రతిభకు అంధత్వం, ఇతర వైకల్యాలు ఆటంకం కాదన్నారు. ఇలాంటి సంస్థలను అందరూ ప్రోత్సహించాలన్నారు. వాయిస్ ఆఫ్ వీఐపీ సభ్యులు, వలంటీర్లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు కృష్ణారెడ్డి, ఐశ్వర్య, గాయత్రి, కరుణాకర్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.









# మైసూరులోని ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రాన్ని సీపీ బ్రౌన్‌లో ఏర్పాటు చేయాలి

మైసూరులోని ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రాన్ని సీపీ బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రంలో ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అన్నారు. ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య లక్ష్యంగా చిత్తూరు జిల్లాలో విద్యాయాత్రను ప్రారంభించిన అనంతరం కడప జిల్లా పర్యటనలో భాగంగా బ్రౌన్ గ్రంథాలయాన్ని జేపీ సందర్శించారు. పరిశోధనా కేంద్రంలోని ప్రాచీన వారసత్వ సంపదలైన తాళపత్ర గ్రంథాలను, తామ్ర శాసనాన్ని, ప్రాచీన పత్రికలు, గ్రంథాలను చూసి జేపీ సంతోషం వ్యక్తం చేశారు. ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేయటం వల్ల తెలుగు భాషాసాహిత్యాలపై మరిన్ని పరిశోధనలు చేసి తెలుగుభాషను పరిరక్షించుకోవడానికి ఈ కేంద్రం దోహదపడుతుందని, ఇది చారిత్రక అవసరమని అన్నారు. మిణుకుమిణుకుమంటున్న తెలుగు వాఙ్మయాన్ని బతికించి మన సంస్కృతిని, వారసత్వాన్ని మళ్లీ మనకు సీపీ బ్రౌన్ అందించారని జేపీ అన్నారు. బ్రౌన్ నడయాడిన ప్రాంతంలో ఈ కేంద్రం ఉండటం మన అదృష్టమన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో ఈ పరిశోధనా కేంద్రానికి రూ.30 లక్షలు ప్రభుత్వ నిధిని అందించి అభివృద్ధికి తోడ్పడ్డారని, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి అంతకు మూడింతలు నిధులిచ్చి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

ఈ కేంద్రాన్ని నెలకొల్పిన జానమద్ది హనుమచ్ఛాస్త్రి, అభివృద్ధి పథంలో నడిపిస్తున్న యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి రామచంద్రారెడ్డి, ఆచార్య ఎం.రామకృష్ణారెడ్డి, ఆచార్య జి.గులాంతారీఖ్‌లు అభినందనీయులన్నారు. ఇలాంటి ప్రయత్నాలకు దాతలు సహాయసహకారాలను అందించాలన్నారు. అనంతరం జేపీకి బ్రౌన్ కేంద్రం బాధ్యులు డాక్టర్ మూల మల్లిఖార్జునరెడ్డి పుస్తకాలు బహూకరించారు. మేనేజింగ్ ట్రస్టి జానమద్ది విజయభాస్కర్, పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకుడు చింతకుంట శివారెడ్డి, భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథాలయ పాలకుడు రమేష్‌రావు, నీలకంతేశ్వర్, రాణి, చంద్రకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

**మధ్యాహ్న భోజనాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేయండి**

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించేందుకు మీ వంతు కృషి చేయండని ఎఐఎస్ఎ కడప జిల్లా అధ్యక్షుడు కాలేషా జేపీని కోరారు. ఈ మేరకు ఆయనకు విద్యార్థి నేతలు విజ్ఞాపనపత్రం అందించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జేపీ హామీ ఇచ్చారు.

## జాతి హితం కోసం మద్దతివటానికి ఏమాత్రం జంకేవారు కాదు..

**జైపాల్‌రెడ్డి అకాల మరణం తనకూ పెద్ద లోటన్న జేపీ**

దిగ్గజ రాజకీయనేత ఎస్.జైపాల్‌రెడ్డి అకాల మరణం తెలుగు రాష్ట్రాలకు, దేశానికి కూడా ప్రజాజీవితంలో పెద్ద నష్టమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. రాజకీయాలకు ఆయన సంస్కారాన్ని, అధ్యయనాన్ని, హుందాతనాన్ని, విలువల్ని అందించారని నివాళులర్పించారు. వ్యక్తిగతంగా జైపాల్‌రెడ్డి తనకెంతో ఆత్మీయ మిత్రులని.. జాతి ప్రయోజనాలకు దోహదం చేసే విధానాలు, సంస్కరణలకు సంబంధించి తనకు అండదండలనందించటానికి పలు సందర్భాల్లో ఏమాత్రం సంకోచించకుండా పార్టీలకతీతంగా ముందుకొచ్చారన్నారు. జైపాల్‌రెడ్డి మృతి పెద్ద లోటుగా ఉంటుందని జేపీ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# కులం, మతం, ప్రాంతం లేకుండా సేవలందించే వృత్తి వైద్యం

కులం, మతం, ప్రాంతం సహా భేదాలేవీ లేకుండా రోగుల ఆరోగ్యమే పరమావధిగా సేవలందించే వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనది, గౌరవప్రదమైనదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఆధునిక మానవ చరిత్రలోనే గొప్ప ఆవిష్కరణలు వైద్య రంగంలో ఉన్నాయని, ఇవి కోట్లాదిమందికి ప్రాణం పోశాయని అన్నారు. వైద్య సేవల పరిధిని ఇంకా పెంచే నూతన ఆవిష్కరణలు ఇప్పుడు అవసరమన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా కూకట్‌పల్లి నిజాంపేట రోడ్డులోని శ్రీశ్రీ హోలిస్టిక్ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొన్ని సందర్భాల్లో వైద్యులపై దాడులు జరుగుతుండటం దురదృష్టకరమని, ఇందుకు ప్రభుత్వాల విధానాల వైఫల్యమే ప్రధాన కారణమని జేపీ అన్నారు. డాక్టర్లకు, రోగులకు మధ్య సంబంధాలు సక్రమంగా లేకపోవటం వల్ల ప్రజారోగ్యమే నష్టపోతుందన్నారు. ప్రజలందరికీ వారి జేబుల్లో నుంచి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యాన్ని అందించటం పూర్తిగా సాధ్యమని, ప్రాథమిక వైద్యం, ఫ్యామిలీ డాక్టర్ పునాదిగా అటువంటి వైద్య విధానాన్ని అమలు చేయకపోవటం వల్లే సమస్య జటిలమవుతోందన్నారు. అందరికీ అందుబాటులో నాణ్యమైన ఆరోగ్య విధానం కోసం డాక్టర్లు, ప్రజలు కూడా కృషి చేయాలన్నారు. వైద్య వృత్తి కత్తి మీద సాము లాంటిదని, రోగిని కాపాడేందుకు వచ్చిన దేవుడి అవతారమే వైద్యుడని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి, ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ వి.ఎస్ రామచంద్ర, సీఈవో డా. సుబ్బారావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కూకట్‌పల్లి అధ్యక్షుడు డా. రంగారావు, వైద్యులు తుషారా, వెంకట రామ్‌ప్రసాద్, రాజేష్ ఖన్నా, సిబ్బంది, ఉప్పలపాటి శ్రీకాంత్, టీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




## విద్యా రంగంలో నిధుల్ని కొత్త ప్రాధాన్యతలతో తిరిగి కేటాయించాలి

విద్యారంగానికి ప్రభుత్వం ఇస్తున్న నిధులు సక్రమంగా వినియోగమయ్యేలా పునఃకేటాయింపులు జరపాలని ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్–ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. జాతీయ విద్యావిధానం–2019 ముసాయిదాపై 'సేవ్ ది చిల్డ్రన్' ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సౌతిండియా రీజినల్ కన్సల్టేషన్ సమావేశంలో ఆయన కీలకోపన్యాసం ఇచ్చారు. విద్యను మన సమాజంలో ఎక్కువమంది ప్రేమిస్తున్నా, అందుకోసం త్యాగాలు చేస్తున్నా కూడా.. విద్యలో విజయం పట్ల అవగాహన లేకపోవటం వల్ల కోట్లాదిమంది పిల్లలకు సరైన విద్య అందటం లేదన్నారు. విద్యార్థులు ఏం నేర్చుకుంటున్నారు.. అనే ప్రధాన లక్ష్యంతో సంబంధంలేని విద్యావ్యవస్థను కొనసాగిస్తున్నారన్నారు. దీనివల్ల పేదరికం, కులవివక్ష కొనసాగుతూ దేశం, ప్రతీ కొత్తతరం తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. పాఠశాలల్ని హేతుబద్ధీకరించటం, బోధనా ప్రమాణాలను పెంచటం, పరీక్షల్ని తేలికపరచటం వంటి మార్పుల్ని చేపట్టాలన్నారు. పిల్లల చుట్టూ తిరిగేలా, వారి విద్యాప్రమాణాల్ని పెంచేలా ప్రోత్సాహకాలను మార్చాలన్నారు.

# సీమ, ఉత్తరాంధ్రకు ప్రాంతీయ మండళ్లు ఏర్పాటు చేయాలి, జిల్లాలవారీగా బడ్జెట్‌లు ప్రకటించాలి: జేపీ

రాష్ట్రం అభివృద్ధిపథంలో నడవాలంటే రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రాంతీయ మండళ్లు ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయ ప్రకాష్ నారాయణ్ పునరుద్ఘాటించారు. రాజధాని అమరావతిలో కూర్చుని ఆదేశాలు జారీ చేస్తుంటే ఎంత టెక్నాలజీ ఉన్నా అభివృద్ధి సాధ్యం కాదన్నారు. ఎక్కడికక్కడ ప్రజల అవసరాలను గుర్తించి వారి చేతికి అధికారం ఇచ్చినప్పుడే మార్పు సాధ్యమన్నారు.

చిత్తూరు జిల్లాలో విద్యాయాత్రను ప్రారంభించిన అనంతరం కడప జిల్లా రామాపురం మండలం బండపల్లెలోని ప్రేమాలయాన్ని జేపీ సందర్శించారు. వృద్ధాశ్రమంలో ఉన్నవారిని పలకరించారు. ఆశ్రమం ఎలా ఉంది, సరిగ్గా చూసుకుంటున్నారా అని వాకబు చేశారు. అనంతరం జేపీ మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రూ.2,27,975 కోట్లతో ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని.. ఇందులో 10 శాతం ప్రాంతీయ మండళ్లకు ఇచ్చినా రూ.25,000 కోట్లు వచ్చేవని అన్నారు. ఈ జిల్లాల సమస్యలు నిధుల కొరత లేకుండా జిల్లాల్లోనే పరిష్కారమయ్యేవన్నారు. ఆదాయవకాశాల మధ్య అంతరాలు పెరిగిపోవటమే ప్రాంతీయ అసమానతలకు కారణమని, పాలనను, వనరుల్ని జనాభాకు అనుగుణంగా వికేంద్రీకరించి జవాబుదారీతనం ఉండేలా చూస్తేనే సమతుల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.





రాయలసీమ, ఉత్తరాంధ్రలకు బుందేల్‌ఖండ్ ప్యాకేజీ ద్వారా రూ.25,000 కోట్లు రావాలని, కేంద్ర ప్రభుత్వం ఈ హామీని ఇచ్చి ఇప్పటికి ఐదేళ్లు దాటిపోయాయని జేపీ అన్నారు. దీనికి వడ్డీ కూడా రూ.2,500 కోట్లు అవుతుందని, కానీ రెండు సంవత్సరాలకంటూ కేవలం రూ.700 కోట్లు ఇచ్చిందన్నారు. జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున మాత్రమే సీమ, ఉత్తరాంధ్రలోని ఏడు జిల్లాకు ఇస్తామని కేంద్రం చెబుతోందని, ఇది విభజన హామీల్ని ఉల్లంఘించటమేనని అన్నారు. రూ.25,000 కోట్ల మేర బుందేల్‌ఖండ్ ప్యాకేజీని డిమాండ్ చేసే హక్కు మనకుందన్నారు. కేంద్రం నుంచి విభజన హామీల మేరకు రావాల్సిన డబ్బుని, ఇతర సహాయాల్ని కచ్చితంగా, ఇతర రాష్ట్రాలు కాదనలేని విధంగా లోక్‌సత్తా ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల బృందం తేల్చిందని, ఈ నివేదికను ఉపయోగించుకుని రాష్ట్ర ప్రయోజనాలను సాధించుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధుల్ని సాధించటంతోపాటు రాష్ట్ర బడ్జెట్ నుంచి కూడా ఈ ప్రాంతాలకు మండళ్ల ద్వారా నేరుగా కేటాయించాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఏముందో, అది ఏరకంగా ఉపయోగపడుతుందో చాలామంది ప్రజలకు తెలియదని, అదే బడ్జెట్ కూడా జిల్లాలవారీగా ఉంటే తేలిగ్గా అర్థమవుతుందని అన్నారు. అందుకే జిల్లాలవారీ బడ్జెట్‌లను ప్రకటించాలన్నారు. నిధుల కేటాయింపుతోపాటు నిధుల వ్యయం తీరును కూడా రాష్ట్ర ప్రభుత్వం మార్చుకోవాలని జేపీ అన్నారు. విద్యారంగానికి రూ.34,000 కోట్లను వెచ్చిస్తున్నా.. పనికొచ్చే విద్యను అందించే దిశగా ఖర్చు చేసే ఏర్పాట్లు లేవన్నారు. రాష్ట్ర విద్యారంగంలో 90 శాతం ఫలితాలు కేవలం కాగితాల మీదున్నాయని, చెప్పుకోవటానికి మాత్రమే పనికొస్తాయని అన్నారు. సమాజంలో అవినీతి అంటనివారున్నారంటే, ఒక్క ఉపాధ్యాయులేనని, మరోవైపు పిల్లల ఉన్నతి కోసం తల్లిదండ్రులు అపార త్యాగాలు చేస్తున్నారని.. అయినా మంచి చదువు రావటం లేదని అన్నారు. పదిశాతం మందికి మాత్రమే చెప్పుకోదగిన విద్య అందుతోందన్నారు. విద్యను బాగుచేయాలన్న ఆసక్తి గల ఛాంపియన్స్‌ను గుర్తించి తెలుగు రాష్ట్రాల్లో విద్యారంగ మార్పు కోసం కుస్తీ పట్టడానికే విద్యాయాత్రను లోక్‌సత్తా ప్రారంభించిందన్నారు.

ఆరోగ్యరంగంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు వస్తున్నా, ఈ రంగానికి నిధుల్ని కేటాయించకుండా ప్రజల మీద ఆరోగ్య భారాన్ని పెంచుతున్నారని జేపీ అన్నారు. ప్రాథమిక ఆరోగ్యాన్ని బాగు చేయకుండా ఆరోగ్యశ్రీ వల్ల ఉపయోగం ఉండదన్నారు. వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు ముఖ్యమంత్రి రైతుకు ఆదాయం మీద దృష్టి పెట్టాలన్నారు. ఉపాధి హామీ నిధులను భూసార పరీక్షలు, నీరు, ఇతర వనరుల సద్వినియోగానికి వెచ్చించటం నుంచి రిటైల్ చెయిన్ల వరకూ మార్పుల్ని తీసుకురావాలన్నారు. విశ్రాంత ఎంఈవో చిన్నరెడ్డెప్ప, ప్రేమాలయం మేనేజర్ క్రిష్ణ తదితరులు జేపీ వెంట కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తెలంగాణ పురపాలక చట్టం-2019

మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రభుత్వాధికారులు, ప్రజల నుంచి ఎన్నికైన పాలకమండలి సభ్యులు బాధ్యతల్ని విస్మరించినా, సమర్థంగా పనిచేయకపోయినా, అక్రమాలు, అవినీతికి పాల్పడినా వారిపై వేటు వేసే ఏర్పాట్లతో తెలంగాణ నూతన మునిసిపల్ చట్టం-2019 అమల్లోకి వచ్చింది. అమర్యాదగా ప్రవర్తించినా సస్పెన్షన్ వేటు పడుతుంది. చట్టం, ఉత్తర్వుల అమలుకు ఉద్దేశపూర్వకంగా నిరాకరించినా, అధికారం లేదా హోదాని దుర్వినియోగం చేసినా, పౌర సేవలను అందించటంలో విఫలమైనా.. ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యులను, సంబంధిత ఉద్యోగులను తొలగించే అధికారాన్ని ప్రభుత్వానికి, కలెక్టర్లకు కల్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్ణీత గడువులోగా పౌర సేవల్ని అందించకపోతే ఉద్యోగుల నుంచి జరిమానా వసూలు చేస్తారు, చర్యలు తీసుకుంటారు. పాలకమండళ్లను రద్దు చేస్తే, మళ్లీ ఎన్నికలు జరిగేంత వరకు మునిసిపాలిటీల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తారు. మునిసిపల్ పాలకులతోపాటు అధికారులు, సిబ్బందిలో కూడా సేవాభావం, జవాబుదారీతనం పెంచే దిశగా ఈ ఏర్పాట్లు పొందుపరిచారు.



రాష్ట్రవ్యాప్తంగా 13 మునిసిపల్ కార్పొరేషన్లు, 128 పురపాలక సంఘాలు కలుపుకుని మొత్తం 141 పట్టణ స్థానిక ప్రభుత్వాలున్నాయి. కొత్త పురపాలక చట్టం అమల్లోకి రావటంతో.. ఇప్పటి వరకూ ఉన్న పురపాలికల చట్టం-1965, పురపాలక కార్పొరేషన్ల చట్టం-1994 రద్దయిపోయాయి. ఇప్పుడు తెచ్చిన చట్టం రాకముందు తెలంగాణలో ఐదు రకాల పురపాలక చట్టాలు ఉండేవి.

కొత్త చట్టం ప్రకారం.. చాలాకాలంగా ఒకేచోట తిష్ఠవేసిన అధికారులను కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో ఎక్కడికైనా బదిలీ చేసే అవకాశం లభిస్తుంది. ప్రతి మునిసిపాలిటీకి ప్రత్యేకంగా పట్టణ పారిశుద్ధ్య ప్రణాళికను సిద్ధం చేయవలసి ఉంటుంది. వ్యర్థాల పకడ్బందీ నిర్వహణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. ఘనవ్యర్థాలను మునిసిపాలిటీకి అందజేయటం ప్రతి పౌరుడి బాధ్యతగా చట్టంలో పేర్కొన్నారు. ప్రతి మునిసిపాలిటీలో నాలుగు వార్డు కమిటీలను ఏర్పాటు చేసి.. ఘనవ్యర్థాల నిర్వహణ, హరితహారం, మంచినీటి సరఫరా, క్రీడాస్థలాల నిర్వహణ వంటి బాధ్యతల నిర్వహణలో వార్డు సభ్యులను కీలకం చేస్తారు. అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు చెత్తను సేకరించి, వేరు చేసి స్థానిక ప్రభుత్వాల సహకారంతో తరలించాల్సి ఉంటుంది. మునిసిపల్ షాపులను ఇక వేలంపాటల ద్వారా కేటాయిస్తారు. పెంపుడు జంతువుల నిర్వహణకు సరైన చర్యలు తీసుకోవాలి. రోడ్లు, వీధులు, పార్కులు, ఆటస్థలాలు వంటివి ఉన్నచోట్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలి. గాలి, నీరు, శబ్దకాలుష్యాలను పూర్తిస్థాయిలో నిరోధించాలని చట్టం స్పష్టం చేస్తోంది. ఇంటి నెంబర్ల విషయంలోనూ నూతన పద్ధతిని అవలంబించాలని పొందుపరిచారు.

**ప్రత్యేకంగా ఆస్తి పన్ను బోర్డు**

75 గజాల్లోపు ఒక్క అంతస్తు ఇల్లు కట్టుకుంటే.. చెల్లించాల్సిన పన్ను కేవలం వంద రూపాయలే. కొత్తగా ఆస్తి పన్ను చెల్లించాలనుకునేవారు ఆన్‌లైన్‌లో స్వీయధృవీకరణ చేస్తే సరిపోతుంది. ఇంటి యజమాని వాస్తవాల్ని మాత్రమే వెల్లడించాలి. లేకపోతే 25 రెట్లు పరిహారాన్ని వసూలు చేస్తారు. 500 చదరపు మీటర్లు, ఆ లోపు విస్తీర్ణం, భవనం ఎత్తు 10 మీటర్ల వరకు ఉన్న నివాసిత భవనాలకూ స్వీయ ధృవీకరణ పద్ధతిని ప్రవేశపెట్టారు. దానికీ యజమానే జవాబుదారీ. ఆమోదిత ప్లాన్‌కు భిన్నంగా నిర్మిస్తే ఎలాంటి నోటీసులు లేకుండా కూలగొట్టొచ్చు. ఆస్తి పన్నును సకాలంలో వసూలు చేయటానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తారు.

**నిర్ణీత గడువులోగా అనుమతివ్వకపోతే క్రమశిక్షణ చర్యలు**



ఇంటి నిర్మాణం అనుమతి కోసం దరఖాస్తు చేసుకొన్నవారు సమర్పించిన వివరాలు తక్కువగా ఉంటే, దానికి సంబంధించిన సమాచారాన్ని అధికారులు పది రోజుల్లోగా దరఖాస్తుదారునికి తెలపాలి. 21 రోజుల్లో అనుమతి మంజూరు చేయాలి. లేకపోతే, ఆ నిర్మాణానికి అనుమతి ఆటోమేటిక్‌గా లభించినట్లే లెక్క. అర్హులకు నిర్ణీత గడువులోగా అనుమతి ఇవ్వని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. 200 చదరపు మీటర్లలోపు విస్తీర్ణంలో ఇల్లు కట్టుకునేవారు ఎటువంటి తనఖా పెట్టనక్కర్లేదు. అనుమతిలేకుండా నిర్మాణాల్ని చేపట్టేవారికి స్థలం, భవనం విలువలో రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించిన 25 శాతం మొత్తాన్ని జరిమానాగా విధిస్తారు. గరిష్ఠంగా 50 శాతాన్ని జరిమానాగా వసూలు చేస్తారు. వీధుల్లో ఆక్రమణలు లేకుండా ఉండటానికి కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు తీసుకోవాల్సిన చర్యల గురించి కొత్త చట్టంలో వివరంగా చెప్పారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోపు ప్రతీ హోటల్, ఆస్పత్రి, సినిమా థియేటర్, రెస్టారెంట్ల యాజమాన్యాలు అగ్నిప్రమాదాల నిరోధానికి పరికరాలను బిగించాల్సి ఉంటుంది.

**ప్రతి ఏటా నివేదిక ఇవ్వాలి**

ప్రతి మునిసిపాలిటీ గడచిన ఏడాది పురపాలనపై నివేదికను విధిగా ప్రభుత్వానికి సమర్పించాలి. రాబోయే సంవత్సరానికి కూడా నివేదికను ఇవ్వాలి. ధర్మాదాయ, ఇనాములపై నియంత్రణను పురపాలికలకు అప్పగించేలా చట్టంలో పొందుపరిచారు. మునిసిపాలిటీల్లో తీర్మానాలను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వం స్వయంగా గానీ, ఛైర్మన్ లేదా వైస్ ఛైర్మన్, కలెక్టర్, కమిషనర్ చేసిన విన్నపంపై గానీ ఈ అధికారాన్ని వినియోగించవచ్చు. తద్వారా మునిసిపాలిటీ చేసిన తీర్మానం, ఇచ్చిన ఉత్తర్వు, జారీ చేసిన లైసెన్సు రద్దు అవుతాయి.

**ఇంకొన్ని ముఖ్యాంశాలు:**

- జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వార్డులవారీగా పచ్చదన కమిటీల ఏర్పాటు. పచ్చదనం పెంపొందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యులుగా ఉంటారు. హరితహారం లక్ష్యాలపై అశ్రద్ధ వహిస్తే చర్యలు తీసుకుంటారు. నాటిన మొక్కల్లో కనీసం 85 శాతం బతకాలి. అలా బతకకపోతే మునిసిపల్ ఛైర్మన్‌లకు పదవీ గండం తప్పదు. వార్డు సభ్యులు, సంబంధిత ప్రత్యేకాధికారిపై కూడా అనర్హత, తొలగింపు చర్యలు తీసుకుంటారు.
- ఇక నుంచి నగర పంచాయతీల వ్యవస్థ ఉండదు. పురపాలికలు, నగర పాలక సంస్థలు, హెచ్ఎండీఏ తరహా సంస్థలు- మూడే ఉంటాయి. పురపాలికల్లో ఏ మార్పు చేయాలన్నా శాసనసభ ద్వారానే.
- పురపాలికలకు ఏటా కేటాయించే నిధులను ఒకవేళ ఖర్చు చేయకపోతే అవేమీ మురిగిపోవు. తర్వాతి సంవత్సరం ఉపయోగించుకోవచ్చు.
- మునిసిపాలిటీల్లో నీటికి కూడా ఆడిట్ నిర్వహించాలని కొత్త చట్టంలో నిర్దేశించారు. ఉద్యానవనాలు, నిర్మాణ కార్యకలాపాల కోసం రీసైకిల్డ్ జలాల లభ్యతను పరిగణలోకి తీసుకోవాలి. దుకాణాలు, హోటళ్లు, పరిశ్రమలు వంటి నివాసేతర సంస్థలకు నీటి సరఫరా, కేటాయింపులు, ఛార్జీల విధింపుపై ప్రభుత్వం నియమావళిని రూపొందిస్తుంది. మునిసిపాలిటీల్లో అథారిటీ/ సంస్థ/నీటి బోర్డును ఏర్పాటు చేస్తుంది. దాని ద్వారానే నీటిని తీసుకోవాల్సి ఉంటుంది. నీటి వనరులకు నష్టం కలిగిస్తే జరిమానా/శిక్షను విధించే అధికారం మునిసిపాలిటీలకు ఉంటుంది.
- మునిసిపల్ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు అవగాహన, శిక్షణా కార్యక్రమాల కోసం ప్రత్యేక సంస్థ ఏర్పాటు. ఈ 'అర్బన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'.. ఒక హబ్‌గా పనిచేస్తుంది.

**మునిసిపాలిటీల్లోని సేవలకు నిర్ణీత గడువు..**

## చట్టపరిధిలోకి వచ్చే పౌరసేవలు

నీటి కనెక్షన్, ట్రేడ్ లైసెన్సు, ట్రేడ్ లైసెన్సు పునరుద్ధరణ, మ్యుటేషన్, ఆస్తి పన్ను మదింపు, భవన నిర్మాణ అనుమతి, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, భవన నిర్మాణ అనుమతి సర్టిఫైడ్ కాపీ, భూ వినియోగ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, మరణ ధ్రువీకరణ పత్రం, జన్మదిన పత్రంలో పిల్లల పేరు చేర్చటం, చెత్త తొలగింపు, మురుగునీటి కాలువల శుద్ధి, అప్పీలు తదితరాలు.

- రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, పట్టణాభివృద్ధి సంస్థలు, ప్రాధికార సంస్థల్లో పనిచేస్తున్న వివిధ కేడర్ల అధికారులు, ఉద్యోగులకు పురపాలిక ఏకీకృత సర్వీసు నియమాలు రూపొందించేలా ప్రభుత్వానికి అధికారం కల్పించారు. తద్వారా ఒక సంస్థ నుంచి మరొక సంస్థకు బదిలీలకు వీలు కలుగుతుంది. ఇతర శాఖల వారిని డిప్యుటేషన్ మీద తీసుకునే అవకాశాన్నీ కల్పించారు.
- ధ్రువపత్రాలు, లైసెన్సుల జారీ సహా పలు లావాదేవీలకు ఆన్‌లైన్ సేవలను ఉపయోగించాలి.
- తడి, పొడి చెత్తను వేరుచేయడం ప్రతి ఇంటి బాధ్యత. వేరు చేసిన చెత్తను మునిసిపాలిటీ సిబ్బందికి అప్పగించాలి. అలా ఇవ్వకపోతే చెత్తను తరలించేందుకు అయ్యే ఖర్చును ఆ ఇంటి నుంచి వసూలు చేసే అధికారం మునిసిపాలిటీలకు ఉంటుంది.

# ప్రజాస్వామీకరణ ఇంకా అవసరమేగానీ.. వికేంద్రీకరణ, జవాబుదారీతనం దిశగా మాత్రం పెద్ద అడుగు

## మునిసిపల్ చట్టంపై కేసీఆర్‌కు జేపీ అభినందన, మద్దతు

తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన నూతన మునిసిపల్ చట్టంలో మరింత ప్రజాస్వామీకరణ అవసరమున్నా.. వికేంద్రీకరణ, జవాబుదారీతనం దిశగా మాత్రం ఇదో బలమైన ముందడుగని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. లోక్‌సత్తా ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న హక్కుగా పౌర సేవల అమలును ఇందులో చేర్చి చట్టబద్ధం చేయటం ద్వారా ప్రభుత్వం ప్రజలకు పట్టం గట్టినట్లయిందన్నారు. ఈ చట్టాన్ని తెచ్చినందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావును, శాసనసభను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని, మద్దతిస్తున్నానని అన్నారు.




ప్రజల ఆదాయం కంటే అనేక రెట్లు ఎక్కువ జీతాలను ప్రజల పన్నుల డబ్బు నుంచి ప్రభుత్వోద్యోగులు తీసుకుంటున్నా, జీతాలకు తగ్గ సేవలను వారు ప్రజలకు అందించటం లేదని తెలిసినా తగిన చర్యలు తీసుకునే సాహసాన్ని రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి వరకూ చాలామంది పాలకులు చేయలేకపోయారని, ప్రభుత్వోద్యోగులకడిమాండ్లను నెరవేర్చటం, వారికి జీతాలు పెంచటానికే పరిమితమయ్యారని.. అందుకే పౌర సేవలకు పట్టం గట్టిన తెలంగాణ పురపాలక చట్టాన్ని అందరూ ఆహ్వానించాలని జేపీ అన్నారు. ప్రజల మీద ఎంత పెత్తనం చేస్తే, ప్రజలను ఎంత పీడిస్తే అంత గొప్ప అనే ధోరణిని ప్రభుత్వోద్యోగుల్లో తొలగించాలన్న ఆకాంక్ష తెలంగాణ ప్రభుత్వంలో గట్టిగా కనిపిస్తోందన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వో ద్యోగులు ఉన్నది ప్రజల సేవల కోసమని స్పష్టంగా ప్రకటిస్తూ కేసీఆర్ ప్రభుత్వం ఈ విషయంలో ప్రజల పక్షాన నూటికి నూరుశాతం నిలబడిందన్నారు. పౌర సమాజం పైపైన అభినం దనలకే పరిమితం కాకుండా ప్రభుత్వానికి బలంగా మద్దతిచ్చి చట్టం సక్రమంగా అమలయ్యేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇది ముఖ్యమంత్రికి, ఉద్యోగులకు మధ్య పోరాటం కాదని, ప్రజల సేవల కోసం చేస్తున్న పోరాటమని అన్నారు.

పురపాలన అంటే ముఠాలు కట్టటం, పందేరాలు చేయటం, దండుకోవటం కాదని.. మనందరి ఉమ్మడి అవసరాలైన మంచినీరు, విద్యుత్తు, మురుగునీటి పారుదల, విద్య, ఆరోగ్యం వంటివి సక్రమంగా, నాణ్యమైన రీతిలో అందేలా చూడటమని, అందుకే ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందించే సేవలకు నిర్ణీత గడువు పెట్టి, ఆ గడువులోగా చేయకపోతే దరఖాస్తు చేసుకున్నవారికి రోజుకింతని పరిహారం చెల్లించేలా 'హక్కుగా పౌర సేవల్ని' అందించాలని లోక్‌సత్తా తొలి నుంచీ కృషి చేస్తూ వచ్చిందని జేపీ అన్నారు. భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా.. ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలనం ప్రజాహక్కుల పత్రం (సిటిజన్స్ చార్టర్లు) రూపంలో 1998, అక్టోబర్ 2న 'స్వరాజ్యం' అనే పుస్తకంగా ఆవిష్కరించి ప్రజల్లోకి తీసుకెళ్లామని వివరించారు. ఇప్పటివరకూ దాదాపు 2లక్షలకు పైగా స్వరాజ్యం పుస్తకాలు అమ్ముడయ్యాయని, అది కాక పలుమార్లు కరపత్రాలు, పుస్తకాలు, సమావేశాలు, చర్చలు, విజ్ఞాపనలు, లేఖలు, వ్యాసాల ద్వారా పౌర సేవల (రైట్ టూ సర్వీసెస్/సర్వీస్ గ్యారంటీ) చట్టంపై ప్రజల్లో, పార్టీల్లో చైతన్యం పెంచేందుకు కృషి చేశామన్నారు. లోక్‌సత్తా/ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) స్వయంగా బిల్లుల్ని రూపొందించి తెలుగునాట, జాతీయస్థాయిలోనూ ప్రభుత్వాలకు అందించిందని తెలిపారు. కొన్ని రాష్ట్రాలు వీటిని అందిపుచ్చుకున్నా.. తెలుగునాట ఇప్పటివరకూ సిటిజన్స్ చార్టర్లు ప్రజలకు అనధికారికంగానే అమలయ్యాయని, తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన తాజా చట్టంతో ఇక రాష్ట్రంలో పలు మునిసిపల్ సేవలు నిర్ణీత గడువులోగా, లేదంటే పరిహారంతో అమలవుతాయన్నారు.

**కలెక్టర్లు అంబుడ్స్‌మన్‌లుగా వ్యవహరించగలరన్న విశ్వాసం ఉంది**

మనం ప్రజాస్వామ్యాన్ని దిగజార్చటం వల్ల ఓట్ల కొనుగోలు, అవినీతి పైస్థాయిలో ఉన్నట్లే స్థానిక ప్రభుత్వాల్లో కూడా ఉన్నాయని, అందుకే స్థానిక ప్రభుత్వాలకు అధికారాలతోపాటు జవాబుదారీతనం కూడా ఉండాలని, ఇందుకోసం ప్రతి జిల్లాకు, పెద్ద నగరానికీ స్వతంత్ర అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా తొలినుంచీ పోరాడుతోందని జేపీ అన్నారు. మునిసిపాలిటీల్లో తప్పు జరిగితే చర్యలు తీసుకునే అంబుడ్స్‌మన్‌గా ఇప్పుడు తెలంగాణలో కలెక్టర్లు వ్యవహరిస్తారని, చిన్న జిల్లాలు, జిల్లాల సంఖ్య 10 నుంచి 33కు పెరగటం, యువ ఐఏఎస్‌లు జిల్లా కలెక్టర్లుగా ఉండటం వల్ల వారందరూ రాజకీయాలకతీతంగా పురసేవల్ని మెరుగుపరిచేందుకు కృషి చేస్తారన్న విశ్వాసం తనకుందన్నారు. 'జిల్లాకు సంబంధించిన అంశాలు, సమస్యలు జిల్లాలోనే పరిష్కారమవటం' వికేంద్రీకరణలో పెద్ద అడుగన్నారు. ఇంకొంత ప్రజాస్వామీకరణ కూడా జరిగితే ఇంకా అనుకూల ఫలితాలు వస్తాయన్నారు.

**నిధులివ్వండి, కనీసం 10% నిధుల్ని పంచండి**


ప్రభుత్వం చట్టంలోని ఇంకొన్ని అంశాలను సరిదిద్దుకోవాల్సి ఉందని జేపీ అన్నారు. తాజా యూనియన్ బడ్జెట్ గణాంకాల ప్రకారం, కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ ఆర్థిక సంవత్సరం రాష్ట్రాలకి 47.70 శాతం నిధులు పంపకం అయ్యాయని, మరి అదేరీతిలో

స్థానిక ప్రభుత్వాలకు రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు నిధుల్ని బదిలీ చేయటంలేదని ప్రశ్నించారు. ప్రజల అవసరాల్ని ఎక్కువగా తీర్చేది రాష్ట్రాలు గనుక రాష్ట్రాలకు నిధుల పంపకం ఎక్కువగా ఉండాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నప్పుడు.. అదే ఫెడరలిజంలో భాగంగా ప్రజల రోజువారీ అవసరాలు ఎక్కువగా ఉండే స్థానిక ప్రభుత్వాలకు కూడా తగినవాటా నిధుల్ని ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి పంచినట్లు 50 శాతం కాకపోయినా, కనీసం 10 శాతం నిధుల్ని స్థానిక ప్రభుత్వాలకు ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం తొలుత చర్యలు తీసుకోవాలన్నారు. మా ఇంటికొస్తే ఏం తెస్తారు, మీ ఇంటికొస్తే ఏమిస్తారు అనే ధోరణి తగదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో పౌరుని మీదా ఏటా రూ.50,000 ఖర్చు చేస్తోందని, అందులో కనీసం రూ.5,000 స్థానిక ప్రభుత్వాల ద్వారా ప్రజల అవసరాలకు వెచ్చించాలన్నారు. అలాగే మునిసిపల్ ఛైర్మన్లు, మేయర్లకు ప్రత్యక్ష ఎన్నికలు జరిపి ఉంటే బాగుండేదన్నారు. వార్డు కమిటీల్లో ఎంపిక చేసే 60 మందిలో ప్రజాసేవాభావం, సమర్థత ఉన్నవారిని ఎంపిక చేయాలని, మునిసిపాలిటీలు విఫలమైతే ప్రజల కోసం గొంతెత్తే వార్డు కమిటీలకు మద్దతుగా కలెక్టర్లు జోక్యం చేసుకోవాలన్నారు.

**మరింత ప్రజాస్వామీకరణ దిశగా భవిష్యత్తులో చట్టంలో మార్పులకు వెసులుబాటివ్వండి**

మొత్తంగా తెలంగాణ మునిసిపల్ చట్టం-2019.. పాలనలో వికేంద్రీకరణ, జవాబుదారీతనం దిశగా ఒక బలమైన ముందడుగని, మరింత ప్రజాస్వామీకరణ దిశగా సూచనల్ని స్వీకరించి భవిష్యత్తులో చట్టంలో అవసరమైన మార్పులు చేయటానికి కూడా ప్రభుత్వం సానుకూలతతో సంసిద్ధంగా ఉండాలని జయప్రకాష్ నారాయణ్ సూచించారు.

## అశ్రునివాళి



మహబూబ్ నగర్ జిల్లా లోక్ సత్తా ఉద్యమ కార్యకర్త ,నాయకులను ముందుండి నడిపించిన ఉద్యమ సేనాని పి ఎల్ నరసింహారావు (83) ఇటీవల మృతి చెందారు. నరసింహారావు గారి మరణం లోక్ సత్తా ఉద్యమ సంస్థకే కాకుండా జిల్లాలోని సామాజిక ఉద్యమ కారులకు కూడా తీరని లోటని లోక్‌సత్తా తెలుగు రాష్ట్రాల ఉద్యమ సమన్వయకర్త బండారు రామ్మోహనరావు అశ్రు నివాళి అర్పిస్తూ ఆయనతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పదిహేడేళ్లుగా ఉద్యమ సంస్థలో పదవిలో ఉన్నా లేకున్నా సామాజిక కార్యకర్తగా ఆయన తన బాధ్యతలను నిర్విరామంగా గా నెరవేరుస్తూ వచ్చారన్నారు. రాతల్లో మాటల్లో సామాజిక చైతన్యం ఆయనలో కనిపించేది. ఆయన వాగ్దాటి ఎదుటివారిని చిత్తు చేసేది. ఆయన నమ్మిన సిద్ధాంతం పట్ల ఆలోచనల పట్ల నిబద్ధతతో చివరిదాకా పనిచేశారు .ఆయనకు నాకు పాతికేళ్ళ వయస్సు తేడా ఉన్న నాతో సమానంగా నడవడం మాట్లాడడం లో వెనకడుగు వేసే వారు కాదని గుర్తు చేసుకున్నారు. ఆయన కోరిక మేరకు మరణానంతరం ఆయన కళ్లను హైదరాబాదులోని ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు .మరణంలో కూడా మరో ఇద్దరికి చూపు నిచ్చి ఉద్యమ స్ఫూర్తిని అందరికీ పంచారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు రామ్మోహనరావు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## అభివృద్ధిని కాంక్షించే వారినే గెలిపించుకోవాలి

రాబోయే పురపాలక సంఘ ఎన్నికల్లో ప్రజల మధ్యన ఉండి పట్టణ అభివృద్ధిని కాంక్షించే వారినే కౌన్సిలర్లుగా గెలిపించుకోవాలని హుస్నాబాద్‌లో స్ఫూర్తి అసోసియేషన్, లోక్‌సత్తా ఉద్యమ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చాగోష్టిలో పలువురు అభిప్రాయపడ్డారు. మున్సిపల్ ఎన్నికలు - పట్టణ అభివృద్ధి - పౌర సమాజ పాత్ర అనే అంశంపై నిర్వహించిన ఈ చర్చాగోష్టిలో వివిధ సంస్థల ప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎన్నికల్లో భారీ వ్యయాన్ని తగ్గించాలని, ఓటర్లు అమ్ముడుబోయే వ్యక్తులుగా కాకుండా ఆలోచించి హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. పట్టణంలో జరిగిన, జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై పలువురు చర్చించారు. హుస్నాబాద్‌లో పురపాలక సంఘ కార్యాలయ భవన నిర్మాణం రహదారుల అభివృద్ధి, నీటి సరఫరా వివిధ విపణుల ఏర్పాటు తదితర అంశాలపై పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి చూపలేదని, ఆశించిన విధంగా జరుగలేదని అవకాశాలు ఉన్నా చేపట్టలేదని పలువురు విమర్శించారు. డిగ్రీకళాశాల భవన నిర్మాణం సకాలంలో చేయలేదు. సౌకర్యాలు లేక ప్రవేశాలకు విద్యార్థులు రావడం లేదు. మిషన్ భగీరథ పైపులైన్ల నిర్మాణం వల్ల రహదారులన్నీ వర్షాలకు గుంతలు పడి ఇబ్బంది కలిగిస్తున్నాయన్నారు. స్ఫూర్తి అధ్యక్షులు పందిళ్ల శంకర్, లోక్‌సత్తా నాయకులు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# ఉపాధి ఎందుకు లభించటంలేదో యువత తెలుసుకోవాలి

ప్రైవేటు కార్యాలయాలైనా సరే కుల, మత, ఆర్థిక వివక్షలు లేకుండా అందరికీ అవకాశాలు కల్పించాలని, పనిగట్టుకుని ఎవరి మీద వివక్ష చూపినా చర్యలు తీసుకోవాల్సిందేనని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. అలాంటి ప్రైవేటు సంస్థల ఉత్పత్తుల్ని, సేవల్ని బహిష్కరించాలన్నారు. చట్టబద్ధ పాలన, అందరికీ సమాన ఎదిగే అవకాశాలు.. ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలన్నారు.

ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్ 2019 విద్యాయాత్రను చిత్తూరు జిల్లాలో ప్రారంభించిన అనంతరం కడపకు వచ్చిన జేపీ.. అక్కడ టర్నింగ్ పాయింట్ కోచింగ్ సెంటర్‌లో 'విద్యా ప్రమాణాలు–ఉపాధి అవకాశాలు'పై విద్యార్థులు, యువతతో ముఖాముఖిలో పాల్గొన్నారు.

మన దేశంలో ఉపాధిని సృష్టించలేని అసమర్థ పాలనతోపాటు, పోటీ ప్రపంచంలో ఎక్కడైనా ఉపాధిని పొందే నైపుణ్యాలను అందించలేని అధ్వాన్న విద్యావ్యవస్థ కూడా పెద్దసమస్యగా కొనసాగుతోందని జేపీ అన్నారు. విద్య అంటే ఏమిటో కాస్త అర్థం చేసుకుంటే.. మన విద్యాప్రమాణాలు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థమవుతుందన్నారు. ఉత్తీర్ణత సర్టిఫికెట్లు తప్ప ఆ డిగ్రీకి తగిన నైపుణ్యాలు మనలో చాలామందికి కొరవడుతున్నాయన్నారు. ప్రభుత్వాలు నాణ్యమైన విద్యను అందించటంతోపాటు తాము చేయవలసిన ఇతర పనులు.. చట్టబద్ధ పాలన, మౌలిక వసతులు వంటివి సక్రమంగా చేస్తేనే ఉపాధి అవకాశాలు అందరికీ అందుబాటులోకి వస్తాయన్నారు. ఎక్కడబడితే అక్కడ ఉపాధిని పొందగలిగే శక్తిని యువత వికసింప చేసుకోగలుగుతారన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ సచివాలయాలను రెండు వేల మంది జనాభాకు ఒకటి ఏర్పాటు చేయటం కంటే, పది వేల జనాభాకు ఒకటి ఏర్పాటు చేయటం మేలని జేపీ సూచించారు. ఇలా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలకు అన్ని రకాల వసతులనూ కల్పించి, అన్ని పనుల్నీ అక్కడే జరిగేలా చేయాలని, జవాబుదారీతనానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. జర్మనీలో స్థానిక మునిసిపాలిటీలో దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి పనయినా అక్కడే పరిష్కారమవుతాయని, పాస్‌పోర్టు కూడా అక్కడే తీసుకోవచ్చని అన్నారు. మన దేశంలో అలాంటి పరిస్థితి లేదన్నారు. యువతలో మార్పు వచ్చినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమన్నారు.

ఏ అంశాల కోసం పట్టుబట్టాలో వాటి కోసం పనిచేయకపోతే, జనాభాలో ఎక్కువగా ఉన్న యువతే ఎక్కువగా నష్టపోయే ప్రమాదముందని, అందుకే యువతీయువకులు ఎక్కడికక్కడ స్థానిక సమస్యల మీద పనిచేయటం ప్రారంభించాలని జేపీ అన్నారు. ప్రభుత్వాలు ఉద్యోగులకు జీతాలివ్వటం, ఓట్ల కోసం తాయిలాల్ని, పథకాల్ని అమలు చేయటం తప్ప.. ప్రజల కోసం చేయాల్సింది చేయటం లేదన్నారు. పైకి కొన్ని మంచి విషయాలను మాట్లాడినా వాటి అమలులో కూడా సరైన విధానాలను తీసుకోకుండా మభ్యపెడుతున్నారన్నారు. యువత తమకిష్టమైన రంగంలో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని, కొంత ఆలోచనతో సమాజం కోసం సమయాన్ని వెచ్చించాలని సూచించారు. విద్యార్థులు వ్యక్తం చేసిన పలు సందేహాలను జేపీ ఈ సందర్భంగా నివృత్తి చేశారు. అంతకుముందు టర్నింగ్ పాయింట్ ఆవరణలో మొక్కలు నాటారు. శిక్షణా కేంద్రం నిర్వాహకుడు ఉత్తమ రెడ్డి, పీఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మారంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికలు ప్రజల కోసం కావాలి.. పార్టీల కోసమో, వ్యక్తుల కోసమో కాదు!

### లోక్‌సత్తా పార్టీ మునిసిపల్ ఎన్నికల పోస్టర్‌ను ఆవిష్కరించిన జేపీ

రాష్ట్రంలో జరగనున్న మునిసిపల్, కార్పొరేషన్ ఎన్నికలు పార్టీల కోసమో, వ్యక్తుల కోసమో కారాదని.. స్థానిక ఎన్నికలు ప్రజల కోసం జరిగితేనే పురపాలన, రోజువారీ జనజీవితాలు బాగుపడతాయని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మునిసిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న నేపథ్యంలో 'పురపాలన పురోగతికి ప్రగతి సూత్రాలు- లోక్‌సత్తా విధానాలు' పేరుతో లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర విభాగం రూపొందించిన గోడపత్రికను పార్టీ రాష్ట్ర కన్వీనర్ తుమ్మనపల్లి శ్రీనివాస్, సీనియర్ నేతలు కటారి శ్రీనివాసరావు, నందిపేట రవీందర్, దోసపాటి రాము, శ్రీనివాసవర్మలతో కలిసి హైదరాబాద్ కార్యాలయంలో జేపీ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా హక్కుగా పనులు చేసిపెట్టేందుకు 'పౌర సేవల' చట్టం తెచ్చేందుకు లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నం ఇటీవల తెలంగాణలో ఫలించిందని.. ఈ చట్టం సక్రమంగా అమలు చేయటానికి క్షేత్రస్థాయిలో కూడా లోక్‌సత్తా గట్టి కృషి చేయాల్సి ఉందని అన్నారు. సర్కారీ ఆఫీసుల్లో సేవలు సరిగా అందకపోతే పరిహారం వసూలు చేసుకునేలా ప్రజల్లో చైతన్యాన్ని పెంచకపోతే చట్టం కాగితాలకే పరిమితమయ్యే ప్రమాదముందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు 50 శాతం నిధులు వస్తున్నట్లే, రాష్ట్రం నుంచి కూడా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు కూడా విధిగా రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు బదిలీ చేయటం, నాణ్యమైన విద్య, వైద్యం, మౌలిక వసతుల కోసం కూడా లోక్‌సత్తా తన పోరాటాన్ని కొనసాగించాలన్నారు. తెలంగాణకు స్వరాష్ట్రం వచ్చిందిగానీ, సురాజ్యం రాలేదని.. ప్రతి దానికీ ముఖ్యమంత్రి, ఇతర ప్రజాప్రతినిధుల ఇళ్ల దాకా వెళ్లాల్సిన అవసరం లేకుండా 'ప్రజల ఇంటి ముందు ప్రభుత్వం-కంటి ముందు పాలన' ఉండే సురాజ్యం లోక్‌సత్తా ఎజెండాతోనే సాధ్యమన్నారు. ఎన్నికల సందర్భాన్ని ఉపయోగించుకుని ప్రజల్లోకి ఈ వాస్తవాల్ని, పరిష్కారాల్ని తీసుకెళ్లాలన్నారు. పౌర సేవలు, పట్టణాలు,

## టీఎస్‌కు లోక్‌సత్తా పార్టీ కొత్త టీం..

వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ దిశానిర్దేశంలో పలు సమావేశాలు, సంప్రదింపుల అనంతరం లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని పార్టీ నేతలు ఖరారు చేశారు. కొత్త టీంలో భాగంగా 10 మంది సీనియర్ నేతలతో రాష్ట్ర సలహా కమిటీని కూడా ఏర్పాటు చేశారు.

**లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గం**

రాష్ట్ర అధ్యక్షుడు: తుమ్మనపల్లి శ్రీనివాస్

ఉపాధ్యక్షులు: ఎస్.వి గజానని (మహిళా కోటా), నందిపేట రవీందర్, మెట్ల జగన్, ప్రధాన కార్యదర్శి: కె. శ్రీనివాసవర్మ

కార్యదర్శులు: ఎ.కె లత (మహిళా కోటా), బొర్రా శివరామకృష్ణ (యువత, ఐ.టి), పెద్దగల్ల రాజీవ్ (విద్యార్థిసత్తా), మునూరు గోవర్ధన్ (కార్మికసత్తా), ఎన్.సరోజాదేవి, కడియం శ్రీనివాసరెడ్డి, సి.హెచ్ వంశీకృష్ణ, కులకర్ణి రమేష్‌బాబు, మహేశ్వరపు గట్టయ్య

కోశాధికారి: ఎం. పార్థసారథి

సభ్యులు: బి. వీరప్రతాప్, కె. సుధీర్ రెడ్డి, రామచంద్రుడు, పల్లేటి రమేష్, యు. గంగాభవానీ, మురుగు వీరేష్, ముతుకు నారాయణ, మల్లాది కిషోర్, ఎన్. శ్రీనివాసన్, ఎస్. సత్తయ్య.

**రాష్ట్ర సలహా కమిటీ**

సమన్వయకర్త: కటారి శ్రీనివాసరావు

సభ్యులు: పి. కోదండ రామారావు, బి. రామ్మోహనరావు, పి. రవిమారుత్, రాంరెడ్డి (మహబూబ్‌నగర్), ఎన్. శ్రీనివాస్ (కరీంనగర్), ఎల్.వి రామరాజు, జి. కస్తూరి, దాట్ల లక్ష్మి

కన్వీనర్: గన్‌రెడ్డి రాజారెడ్డి

# ‘అవినీతిరహిత సేవలకు ఈ కొత్త చట్టం తెండి’

## ఏపీ ముఖ్యమంత్రి జగన్‌కు లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ బిల్లుతో జేపీ లేఖ

అవినీతిరహిత పాలన అందించాలని, ప్రజలకు ప్రభుత్వ సేవలు నిర్ణీత కాలవ్యవధిలో అందాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంకల్పాన్ని ప్రకటించటం అభినందనీయమని, కానీ ప్రభుత్వ సేవలన్నీ అవినీతిలేకుండా, సకాలంలో, సమర్థంగా ప్రజలకు అందజేయాలన్న లక్ష్యం సాకారం కావాలంటే సమగ్ర పౌర సేవల చట్టాన్ని తేవాల్సి ఉందని లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్– ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రికి లేఖ రాశారు. లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ రూపొందించిన ‘ద ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ గ్యారంటీ బిల్లు–2019’ బిల్లును తన లేఖకు జత చేశారు. ఆ బిల్లులో తాము ప్రతిపాదించిన ముఖ్యాంశాలనూ లేఖలో ప్రస్తావించారు. “ప్రజలకు ప్రభుత్వ సేవల్ని అవినీతికి అతీతంగా, సమర్థంగా అందించాలన్న మీ అభిమతాన్ని అభినందిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇది వరకే పబ్లిక్ సర్వీస్ డెలివరీ గ్యారంటీ (పీఎస్‌డీజీ) చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. కానీ పరిశ్రమలకు సంబంధించిన 40 సేవలకే వర్తింప చేసింది. మిగతా ప్రభుత్వ సేవలన్నీ ఈ చట్టం పరిధిలోకి తేవడం, అందరికీ వర్తింప చేయడం ఆచరణ సాధ్యమే. అయినా గత ప్రభుత్వాలు ఆ పని చేయలేదు. ఒక ప్రభుత్వం అన్ని విషయాల్లోనూ జవాబుదారీతనాన్ని నెలకొల్పాలనుకున్నప్పుడు ఆ దిశగా సమగ్ర చట్టాన్ని తీసుకురావడం అత్యవసరం. వివిధ సేవలందించేలా బాధ్యత వహించాల్సిన అధికారులు ఎవరు? క్లియరెన్సులు, అనుమతులు, లైసెన్సుల జారీ, రెన్యువల్స్ వంటి సేవలు ఎంత కాలావధిలోగా అందించాలి? జాప్యం జరిగితే దరఖాస్తుదారుకు ఎలాంటి పరిహారం చెల్లించాలి? తనకు సకాలంలో సేవలందకపోతే దరఖాస్తుదారు ఎవరికి అప్పీల్ చేసుకోవాలి?.. తదితరాలన్నీ ఆ చట్టంలో పొందుపరచాలి. అలాంటి చట్టాన్ని తేగలిగితే అది పాలనపై సమాచార హక్కు, లోక్‌పాల్ చట్టాలకంటే గొప్ప ప్రభావం చూపుతుంది” అని జేపీ తన లేఖలో పేర్కొన్నారు.

**సమీకృత సేవలతో మెరుగైన ఫలితాలు**

సిటిజన్స్ చార్టర్లు, పౌర సేవల చట్టంపై ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నాయని జేపీ తెలిపారు. ఈ అంశంపై పార్లమెంటరీ కమిటీ ముందు కూడా చర్చించామన్నారు. పార్లమెంటరీ కమిటీ కోరిక మేరకు సాధారణ ప్రభుత్వ సేవలను, ఎలక్ట్రానిక్ సేవలను కలిపి సింగిల్ బిల్లుగా రూపొందించి ముసాయిదాను అందించామన్నారు. ఆ తర్వాత కూడా పలు రౌండ్‌టేబుల్ సమావేశాలు, చర్చల ద్వారా బిల్లును మెరుగుపరిచామన్నారు. లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ బిల్లును ఏపీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకుని ప్రజలకు రోజువారీ జీవితంలో లంచాలు, వేధింపులు, ఆలస్యాలు లేని నాణ్యమైన సేవల్ని అందించాలని జేపీ విజ్ఞప్తి చేశారు.

## ఏపీ ప్రభుత్వానికి జేపీ పంపిన హక్కుగా పౌర సేవల చట్టం నమూనాలోని కొన్ని ముఖ్యాంశాలు

- ప్రతి ప్రభుత్వ కార్యాలయం, సంస్థకు విధిగా సిటిజన్ చార్టర్లు ఉండాలి. ఏ పని, ఎన్ని రోజుల్లోగా పూర్తి చేస్తారో అందులో స్పష్టంగా తెలియజెప్పాలి. ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, విచారణ, పరిష్కారానికి వీలైనంత ఎక్కువమంది అధికారుల్ని నియమించాలి. ఫిర్యాదు అందిన 30 రోజుల్లోగా పరిష్కరించాలి.
- ఫిర్యాదుల పరిష్కార విధానంలో భాగంగా ప్రతి కార్యాలయంలో సమాచార, ఫెసిలిటేషన్ కేంద్రాలు, కస్టమర్ కేర్ హెల్ప్‌లైన్లు ఉండాలి. వీటికి ప్రత్యేక అధికారుల్ని నియమించాలి.
- తన ఫిర్యాదు/పిటిషన్‌కి నెల రోజుల్లోగా పరిష్కారం దొరకని పక్షంలో ఫిర్యాదుదారు అప్పీలు చేసుకోవడానికి కార్పొరేషన్/జిల్లా స్థాయిలో స్వతంత్ర ప్రతిపత్తి గల అప్పిలేట్ అథారిటీ (ఐడీఏ)ని నియమించాలి. అక్కడా పరిష్కారం దొరక్కపోతే లోకాయుక్తకు ఫిర్యాదు చేసే వీలుండాలి. లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ ముసాయిదా బిల్లు ప్రకారం లోకాయుక్త అత్యున్నత అప్పిలేట్ అథారిటీగా వ్యవహరిస్తారు.

జనబలం
ఆగస్టు 2019
లోక్‌సత్తా ఉద్యమ సంస్థ
మాసపత్రిక

# సానబట్టని నవరత్నాలతో ఏపీ బడ్జెట్ 2019-20

నవరత్నాల పేరుతో ఇచ్చిన ఎన్నికల హామీల అమలుకు పెద్దపీట వేస్తూ ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైకాపా ప్రభుత్వం 2019-20 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది.



నవరత్నాల్లోని ఎక్కువ అంశాలు మౌలికమైనవే అయినా.. ప్రజల్లో స్వావలంబన, స్వతంత్ర జీవనాలను పెంపొందించే దిశగా, ఏపీకి ప్రత్యేకమైన ఎంటర్‌ప్రెన్యూర్ సామర్థ్యాల్ని వెలికితీసే దిశగా వాటికి సానబట్టకుండా, కేవలం మట్టిలోని మాణిక్యాలన్నట్లు నవరత్నాల్ని అమలు చేస్తూ గత పాలకుల తీరులోనే, తాయిలాల పద్ధతిలోనే బడ్జెట్‌లో కేటాయింపుల్ని చేశారు. పేదరికాన్ని నిర్మూలించి ప్రజానీకంలో అశేష సంఖ్యలో ఉన్న మట్టిలోని మాణిక్యాలను వెలికితీసేందుకు కీలకమైన విద్య, ఆరోగ్య రంగాల్లో ఎటువంటి మౌలిక మార్పుల్నీ ప్రతిపాదించకుండా బడ్జెట్‌లో కేవలం కేటాయింపుల్ని గణనీయంగా పెంచటానికే సర్కారు పరిమితమైంది. వీటిపై కమిటీలు వేశాము, వాటి నివేదికలు వచ్చాక తగిన మార్పులు చేస్తామన్న నిర్దిష్ట హామీని సైతం ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. అలాగే వ్యవసాయం, సామాజిక భద్రత రంగాలకు కూడా కేటాయింపుల్ని బాగా చేసినా, వాటి వ్యయం తీరులో పాత రాజకీయ పంథానే అనుసరించారు. చంద్రబాబు ప్రభుత్వంలాగానే కుల రాజకీయాలను ప్రోత్సహించేలా కుల కార్పొరేషన్ల పేరున కేటాయింపులు చేసింది. రైతు సంక్షేమానికి కృషి చేస్తూనే వ్యవసాయానికి-పరిశ్రమలకు సంధానం చేయటానికి బదులు "నూతన రాష్ట్రమైన ఏపీలో ఈ సంధికాలంలో వ్యవసాయం తప్ప.. ఇతర రంగాలైన సేవా, పరిశ్రమల రంగాల్లో అభివృద్ధికి అవకాశాలు తక్కువే" అని ప్రభుత్వం చేసిన ప్రకటన రాష్ట్ర భవిష్యత్తుకు ఆందోళనకర ఘంటికే. 'సేవారంగం బలహీనంగా ఉండటం, వ్యవసాయ రంగం వాటా ఎక్కువ ఉండటం - ఈ రెండూ ఒక ఆధునిక ఆర్థిక వ్యవస్థ బలహీనతని, వెనుకబాటుతనాన్ని సూచిస్తాయి' అని ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీల అమలుపై లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ చొరవతో స్వతంత్ర నిపుణుల బృందం (ఐజీఈ) రూపొందించిన నివేదిక వ్యాఖ్యానించటంతోపాటు.. వ్యవసాయంతోపాటు సేవ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ఆచరణీయమైన నిర్దిష్ట పరిష్కారాలను సూచించింది. ఈ నివేదికను లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కూడా పంపారు. ఈ పరిష్కారాల గురించి ఆలోచన చేయకుండా, యథాతథ స్థితినే కొనసాగిస్తాం, తిరోగమనమైనా మాకు నచ్చినట్లే చేస్తామన్నట్లు బడ్జెట్ విజన్‌లో ప్రభుత్వం వ్యవహరించటం విచారకరం.

గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, తమ సర్కారు ప్రాధాన్యాలను వివరిస్తూ, మహనీయుల మాటలను గుర్తుచేస్తూ ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి అసెంబ్లీలో తమ తొలి బడ్జెట్‌ను రూ.2,27,975 కోట్ల అంచనా విలువతో ప్రవేశపెట్టారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు కలిపి రూ.28,866.23 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పథకాలు, బడ్జెట్‌ను గణనీయంగా పెంచిన పథకాలపై దృష్టి సారించామని ఆర్థిక మంత్రి తెలిపారు. "విభజన సమయంలో రూ. 1,30,654 కోట్లుగా ఉన్న రుణం- 2018-19 నాటికి రూ.2,58,928 కోట్లకు చేరుకుంది.

## రూపాయి రాకపోకలు

### రూపాయి రాక

| | |
|---|---|
| రాష్ట్ర పన్నులు-సుంకాలు | 42.2 |
| కేంద్ర పన్నుల్లో వాటా | 19.5 |
| ఇతర పన్నేతర ఆదాయం | 38.2 |
| వడ్డీ ఆదాయం | 0.1 |

### రూపాయి వ్యయం

| | |
|---|---|
| అభివృద్ధి వ్యయం | 76.1 |
| వడ్డీ చెల్లింపులు | 9.9 |
| పరిపాలనా వ్యయం | 4.8 |
| పన్ను వసూళ్ల వ్యయం | 0.7 |
| ఇతరత్రా వ్యయం | 9.5 |
| లోటు | ( -)1.0 |

ఇదికాక, వివిధ సంస్థల ద్వారా దాదాపు రూ.10 వేల కోట్ల రుణం తీసుకుని ప్రభుత్వ ఖర్చు కోసం మళ్లించారు. సుమారు రూ.18 వేల కోట్ల విలువైన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ రుణాలన్నింటితోపాటు ఫిబ్రవరిలో సమర్పించిన 2019-20 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కింద వాగ్దానాలను నెరవేర్చడానికి రూ. 45,000 కోట్ల వనరుల అంతరం ఉంది" అని తెలిపారు.

సామాజిక పింఛన్లకు బడ్జెట్‌లో భారీగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. వైఎస్సార్ పింఛను, కానుకల పేరుతో దాదాపు తొమ్మిది గ్రూపుల కోసం మొత్తం రూ.15,746.58 కోట్లను ప్రతిపాదించింది. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, డయాలసిస్ రోగులు, కల్లు గీత కార్మికులు, వైఎస్సార్ అభయ హస్తం కింద డ్వాక్రా మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు సయితం పింఛన్లు ఇవ్వనుంది. రజకులు, నాయీబ్రాహ్మణులు, దర్జీలకు ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించింది. ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24,000 ఆర్థిక సాయం అమలు చేయనుంది. సొంత ఆటోలు నడుపుతున్నవారికి రూ.400 కోట్ల వరకు సాయం అందించనుంది.

**రైతులకు కేటాయింపులు**

వ్యవసాయానికి బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.21,000 కోట్లకు పైగా కేటాయించింది. ప్రస్తుతం ఏడు గంటలు ఇస్తున్న ఉచిత విద్యుత్‌ను మరో రెండు గంటలపాటు పెంచి ఇచ్చేందుకు వీలుగా రూ.4525 కోట్లు ఇచ్చింది. ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ.12,500 ఇచ్చేలా రూ.8,750 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. దీనివల్ల 64.07 లక్షల రైతు కుటుంబాలకు ప్రయోజనం దక్కనుంది. కేంద్ర నిధులే కాకుండా అదనంగా పెట్టుబడి సాయానికి భరోసానిచ్చింది. ధరల స్థిరీకరణకు రూ.3,000 కోట్లు కేటాయించింది. ఇప్పటికే ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పడిన 'రైతు మిషన్' ధరల వ్యవహారాన్ని పరిశీలించి అదనపు మద్దతు ధర కల్పించేందుకు వీలుగా మార్కెట్ స్థిరీకరణకు ఈ నిధుల్ని వినియోగించనుంది. పంటలకు ఉచిత బీమా కల్పించనుంది. ఇందుకోసం రూ.1163 కోట్లు కేటాయించింది. ఆక్వా రైతుల విద్యుత్ రాయితీకి నిధులిచ్చింది. కొత్తగా వైఎస్సార్ భరోసా పథకం కింద బోరుబావుల తవ్వకానికి నిధులు కేటాయించింది.

**విద్య, వైద్య రంగాలకు 34 శాతం అదనపు కేటాయింపులు**

విద్య, వైద్య రంగాలకు ఈ బడ్జెట్‌లో 34.87, 34.69 శాతం చొప్పున కేటాయింపులు పెంచారు. జగనన్న అమ్మ ఒడి పథకం కింద ఇంటర్మీడియెట్ స్థాయి వరకు చదువుకునే పిల్లలున్న అమ్మలకు ఆర్థిక సాయం అందించేందుకు రూ.6445.80 కోట్లు కేటాయించినట్లు మంత్రి చెప్పారు. రాష్ట్రంలోనే కాక సమీప రాష్ట్రాల్లోని హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి చోట్లా ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందేందుకు రూ.1740 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక వసతులకు రూ.1500 కోట్లు కేటాయించారు. మొత్తంగా సాధారణ విద్యకు రూ.32,618.46 కోట్లు (ఇందులో పాఠశాల విద్యకు రూ.27,028 కోట్లు), సాంకేతిక విద్యకు రూ.580.29 కోట్లు, వైద్యానికి రూ.11,399.23 కోట్లు ప్రతిపాదించారు.

గ్రామ సచివాలయాలు, పురపాలక వార్డు సచివాలయాల ఏర్పాటు ద్వారా పెద్దఎత్తున ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇందులో భాగంగా ఈ సచివాలయాల ఏర్పాటుకు రూ.880 కోట్లు బడ్జెట్‌లో చూపింది. ఇవికాక వలంటీర్ల నియామకానికి రూ.1000 కోట్లు ప్రతిపాదించింది.

ఇళ్ల నిర్మాణానికీ ప్రాధాన్యత నిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వైఎస్సార్ గృహవసతి కింద రూ.5,000 కోట్లు ఇస్తున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణానికి రూ.9785.75 కోట్లు వెచ్చించనున్నట్లు చెప్పింది. ఇంధన శాఖకూ ఈ బడ్జెట్‌లో 63 శాతం అదనపు కేటాయింపులు చేశారు. జలయజ్ఞం ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు రూ.13,139.05 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ఒక్క పోలవరానికే రూ.5,242 ఇవ్వనుంది. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి 17 శాతం అదనపు నిధులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

కాపుల సంక్షేమానికి రూ.2,000 కోట్లు కేటాయించారు. ఎస్.సి ఉపప్రణాళిక కింద రూ.15,000.85 కోట్లు, ఎస్.టి ఉపప్రణాళిక కింద రూ.4,988.52 కోట్లు, బీసీ ఉపప్రణాళికకు రూ.15,061.64 కోట్లు కేటాయించారు. అగ్రిగోల్డ్ బాధితులకు ఆర్థిక సాయం నిమిత్తం రూ.1,150 కోట్లు, ముఖ్యమంత్రి అభివృద్ధి నిధి కింద బడ్జెట్‌లో రూ.500 కోట్లు, కడపలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు రూ.250 కోట్లు కేటాయించారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి రూ.1,572 కోట్లు ఇచ్చారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద సున్నా వడ్డీకి పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు కలిపి రూ.1,788 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.29,329.98 కోట్లు కేటాయించారు. ఆహారశుద్ధి పరిశ్రమల

**మద్యంపై రూ.2,297 కోట్లు అదనంగా**

**మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహిస్తూ క్రమంగా మద్య నిషేధం విధిస్తామన్న ప్రభుత్వం 2019-20లో మద్యం ద్వారా భారీగా ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తోంది. ఎక్సయిజ్ ఆదాయం 36 శాతం పెరిగి, రూ.8,517 కోట్లు రావొచ్చని తెలిపింది.**

**శాతాల్లో కేటాయింపులు**

| | |
|---|---|
| సాధారణ సేవలు | 29.09 |
| ఆర్థిక సేవలు- | 39.8 |
| సామాజిక సేవలు- | 33.1 |

ప్రోత్సాహానికి రూ.100 కోట్లు, ఎంఎస్ఎంఈల ప్రోత్సాహానికి రూ.200 కోట్లను కేటాయించారు. రాష్ట్రంలో పంట ఉత్పత్తుల నిల్వ కోసం 10 లక్షల టన్నుల సామర్థ్యంతో గోదాములు నిర్మించేందుకు రూ.200 కోట్లు ప్రకటించారు. భూ యాజమాన్య హక్కులకు ఇబ్బంది లేకుండా, భూ యజమాని, కౌలు రైతు మధ్య 11 నెలల కాలానికి మాత్రమే ఒప్పందం అమల్లో ఉండేలా కౌలు చట్టంలో మార్పు తేనున్నట్లు తెలిపారు. సహకార రంగంలోని పాల సమాఖ్యలు, పాల సేకరణ కేంద్రాలను బలోపేతం చేయటానికి రూ.100 కోట్లు ఇస్తామన్నారు. పులివెందులకు రూ.100 కోట్లు, అమరావతికి రూ.615 కోట్లు ప్రతిపాదించారు. రవాణా, రహదారులు, భవనాల శాఖకు రూ.6,202.98 కోట్లు, రహదారి భద్రతకు రూ.50 కోట్లు , పర్యాటకం, క్రీడలకు రూ.604 కోట్లు ప్రకటిం చారు.

మొత్తం రూ.2,27,974.99 కోట్ల వార్షిక బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.1,80,475.94 కోట్లు, మూల ధన వ్యయం రూ.32,293.39 కోట్లు ఉంటుందని అంచనా వేసినట్లు ఆర్థికమంత్రి చెప్పారు. రెవెన్యూ ఆదాయం రూ.1,78,697.41 కోట్లు, కేంద్ర పన్నుల వాటా నుంచి రూ.34, 883.18 కోట్లు, కేంద్రం నుంచి గ్రాంట్లుగా రూ.60,071.51 కోట్లు వస్తాయని రాష్ట్రం అంచనా వేసింది.

## వైద్య కళాశాల డిమాండ్‌ను నెరవేర్చారుగానీ, ఉత్తరాంధ్రకు అన్యాయం చేశారు

లోక్‌సత్తా పార్టీ ఎంతోకాలంగా పోరాడుతున్న 'విజయనగరం జిల్లాకు ప్రభుత్వ వైద్యకళాశాల' డిమాండ్‌ను ఆమోదించి బడ్జెట్‌లో రూ.66 కోట్లను మంజూరు చేయటం హర్షణీయమని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. వైద్య రంగానికి కేటాయింపులు పెంచటం కూడా స్వాగతించదగ్గదని, అయితే పాత పద్ధతిలోనే ఆరోగ్యశ్రీ చుట్టూనే ఖర్చు చేస్తామనటం తగదని అన్నారు. దీనివల్ల ఖజానాకు ఖర్చు తప్ప జనానికి ఆరోగ్యం అందదన్నారు. విద్య, ఆరోగ్య రంగాల్లో ప్రతి రూపాయికీ తగ్గ ఫలితం కోసం లోక్‌సత్తా సూచించిన రీతిలో పాఠశాల విద్య, ప్రాథమిక ఆరోగ్యం మీద గట్టిగా దృష్టి పెట్టాలన్నారు. సాగు ప్రాజెక్టుల్లో ఉత్తరాంధ్రకు అన్యాయం చేశారని, ఈ ప్రాంతంలో ఖాయిలా పడ్డ పరిశ్రమలను తెరిపించటంతోపాటు పారిశ్రామికీకరణకు ప్రయత్నం లేదన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు నిధులు, అధికారాలు గల ప్రాంతీయ మండళ్లను ఏర్పాటు చేయాలన్న లోక్‌సత్తా డిమాండ్‌ను జగన్ ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు.




## ఇంత మెజారిటీ వచ్చినా.. పాత రాజకీయ ఫార్ములానే

"ఈ బడ్జెట్ ద్వారా ఒక్కో ప్రభుత్వ పాఠశాల విద్యార్థి మీదా ప్రభుత్వం ఏడాదికి రూ.90,000 నుంచి 1 లక్ష దాకా ఖర్చు చేస్తోంది. ప్రైవేటు స్కూళ్లకు పంపే ఎగువ మధ్యతరగతి వాళ్లు కూడా ఇంత ఫీజుల చెల్లించటం లేదు. ఇంత డబ్బు వెచ్చిస్తున్నా సరైన చదువు ఎందుకు రావటం లేదు? అన్న ప్రశ్నను ప్రభుత్వం చర్చించ లేదు. అలాగే ఆరోగ్యం మీద ఖర్చును కూడా.. ప్రచారం తప్ప ఆరోగ్యం అందని రీతిలో చేస్తున్నారు. దాదాపు రూ.60,000 కోట్లను కేవలం తాయిలాల్లాంటి పథకాలకు, వ్యయాలకు ఏపీలో వెచ్చిస్తుంటే, తెలంగాణలో రూ.40,000 కోట్లను వెచ్చిస్తున్నారు. 30 శాతం మేర పన్నుల ఆదాయం పెరుగుతుందని, కేంద్రం నుంచి వచ్చే నిధులు పదుల వేలకోట్లు పెరుగుతాయని ఏపీ ప్రభుత్వం బడ్జెట్‌లో వేసిన ఆదాయ అంచనా కూడా చాలా అవాస్తవికంగా ఉంది.



ఇంతవరకూ 30 శాతం మేర పన్ను ఆదాయం పెరిగిన దాఖలా ఎక్కడా లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేకుండా సేవలందించేందుకు తగిన ఏర్పాట్లు చేయలేదు. ప్రజలు స్పష్టంగా చెప్పలేకపోవచ్చుగానీ.. వారి మనసుల్లోని ఆకాంక్షలకు రూపమిస్తే వచ్చే మాటలు, అడిగే ప్రశ్నలు ఇవే! కొత్త పాలకులైనా అవినీతి, వివక్షల్ని అరికట్టి ఎదిగే అవకాశాలున్న వ్యవస్థను నిర్మిస్తారని ఆశపడే వారు ప్రతిపక్షానికి అవకాశమిచ్చారు. కానీ ఇతర రాష్ట్రాలు, ఇతర పాల కుల్లా ప్రజలను తాయిలాలతో తాత్కాలికంగా ఆకర్షిద్దామ నే తప్ప.. జన జీవితాలను బాగు చేసేందుకు, ఎదిగే అవకాశాలను కల్పించేందుకు భారీ విజయాన్ని సాధించిన జగన్ ప్రభుత్వం కూడా ప్రయత్నం చేయటం లేదు".

# సోమశిలను బద్వేలు ప్రాంత చెరువులతో అనుసంధానం చేసే ఎత్తిపోతల ప్రాజెక్టును వెంటనే చేపట్టండి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జేపీ లేఖ



సోమశిల రిజర్వాయరును బద్వేలు చెరువుతో అనుసంధానం చేసే ఎత్తిపోతలను ప్రాధాన్యాంశంగా తీసుకుని వేగంగా అమలు చేయవలసిందిగా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి లేఖ రాశారు. ఇది కడప జిల్లా బద్వేలు ప్రాంతానికి తక్కువ ఖర్చుతో తాగు, సాగునీటిని అందించే ముఖ్యమైన ప్రాజెక్టని, దీని వల్ల మూడు మండలాల్లోని 1,20,000 మంది ప్రజానీకానికి ప్రయోజనం చేకూరటంతోపాటు 28,000 ఎకరాల వ్యవసాయ భూమికి నీరందుతుందని వివరించారు. ఏపీ ముఖ్యమంత్రికి జేపీ రాసిన లేఖ స్థూల పాఠం:

"ప్రియమైన శ్రీ జగన్మోహన్ రెడ్డి గారు,

రాయలసీమలో మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించాలన్న మీ ప్రభుత్వ సంకల్పం నాకు తెలుసు. ఈ నేపథ్యంలో కడప జిల్లా బద్వేలు ప్రాంతానికి తక్కువ ఖర్చుతో తాగు, సాగునీటిని అందించే ఒక ముఖ్యమైన ప్రాజెక్టును మీ దృష్టికి తెస్తున్నాను.

కడప జిల్లా గోపవరం మండలం పొద్దారివారిపల్లె సమీపంలోని సోమశిల రిజర్వాయరు వెనుక జలాలు (బ్యాక్‌వాటర్స్) నుంచి బద్వేలు చెరువు, అట్లూరు, బద్వేలు, గోపవరం మండలాల్లోని మరో 33 చెరువులను నింపటానికి ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం రైతులు, స్థానిక ప్రజల మద్దతుతో పీపుల్ ఎగనెస్ట్ కరప్షన్ (పీఏసీ) అనే స్వచ్ఛంద సంస్థ అనేకసార్లు విజ్ఞాపనలు సమర్పించింది. చివరకు 1 టీఎంసీ నీటిని ఇందుకోసం కేటాయిస్తూ మార్చి 2019లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో (జీవో ఆర్‌టీ నెం. 197) జారీ చేసింది.

నవంబర్ 2017లో నేను స్వయంగా ఈ ప్రాంతాల్లో పర్యటించాను. మూడు మండలాల్లోని దాదాపు 1,20,000 మంది ప్రజానీకం సాగు, తాగు నీటి అవసరాలకు ఈ ప్రాజెక్టు అవసరమనటంలో సందేహం లేదు. ఈ ప్రాజెక్టుకు అంచనా వ్యయం రూ.150 కోట్లు కాగా, దాదాపు 28,000 ఎకరాలకు ప్రయోజనం చేకూరుతుంది. అంటే ఎకరాకు రూ.54,000 మాత్రమే వ్యయమవుతుంది. నిర్వహణ వ్యయం ఏటా రూ.2 కోట్లు, అంటే ఎకరాకు ఓ రూ.1,000 దాకా పడుతుంది.

సోమశిల ప్రాజెక్టు ప్రభావిత గ్రామాలు కడప జిల్లాలోనే ఉన్నా.. ఇక్కడి ప్రజలు, రైతులకు చెప్పుకోదగిన ప్రయోజనాలు దాన్నుంచి సమకూరలేదని మీక్కూడా తెలుసు. ఎత్తిపోతలను చేపడితే బద్వేలు ప్రాంత ప్రజలకు కొంత మేలు జరుగుతుంది.

ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేస్తే కనీసం 1,20,000 మంది ప్రజానీకానికి ప్రయోజనం చేకూరటంతోపాటు 28,000 ఎకరాల వ్యవసాయ భూమికి నీరందుతుంది. తాగునీటి కటకటను తీర్చడమేకాకుండా, ఈ ప్రాంతంలోని వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఎత్తిపోతల ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుంది. సోమశిల రిజర్వాయరు ప్రాజెక్టు సాకారం కావడానికి నేలనిచ్చి ఇక్కడి ప్రజలు చేసిన త్యాగాలను గుర్తించినట్లవుతుంది.

కాబట్టి.. తక్కువ ఖర్చుతో, ఎక్కువ ఫలితాలనిచ్చే సోమశిల రిజర్వాయరును బద్వేలు చెరువుతో అనుసంధానం చేసే ఎత్తిపోతల ప్రాజెక్టును ప్రాధాన్యాంశంగా తీసుకుని వేగంగా అమలు చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను".

అభివందనలతో,

డా॥ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు




"విఖ్యాత పండితుడు మ్యాక్స్‌ముల్లర్ ఏనాడో చెప్పినట్లు.. ఎంతటి సత్యమైనా సరే, నమ్మనివాళ్లు ఉన్నంతకాలం, దాన్ని పదేపదే చెబుతుండాల్సిందే. నేను బలంగా నమ్మే సూత్రం ఇది!"

-మహాత్మాగాంధీ

# పదవుల రాజకీయాన్ని
# 'నాయకత్వ రాజకీయం'గా మార్చండి

మనకు పదవులున్నాయిగానీ, నాయకత్వం లేదని, ఆ పరిస్థితి నుంచి మార్పు కోసం శాసనసభ్యులు ప్రయత్నం చేయాలని లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. ప్రజల తరపున సార్వభౌమాధికారాన్ని రాజ్యాంగం రాష్ట్రాల్లో అసెంబ్లీలకు, జాతీయ స్థాయిలో లోక్‌సభకు మాత్రమే ఇచ్చిందన్నారు. మార్పు సాధించవలసినవాళ్లు మార్పును సాధించకుండా యధాతథ పరిస్థితినే కొనసాగిస్తుంటే, ప్రవాహంలోనే కొట్టుకుపోతుంటే ప్రజలు, ప్రజాస్వామ్యం తీవ్రంగా నష్టపోతాయన్నారు. రాత్రికి రాత్రి మార్పు వస్తుందని తాను చెప్పటం లేదని, కానీ అది పూర్తిగా సాధ్యమన్నారు. అందుకోసం ప్రయత్నించటం చట్టసభ సభ్యులు బాధ్యతని స్పష్టం చేశారు. రాబోయే తరాలు ఎన్నికల విజయాల గురించి, మెజారిటీల గురించి మాట్లాడుకోవని.. ఎవరి ద్వారా రాష్ట్రానికి, దేశానికి మేలు జరిగిందో వారి గురించి, వారి కృషి గురించి మాత్రమే చర్చిస్తాయని అన్నారు.




ఆంధ్రప్రదేశ్ శాసనసభ, మండలి సభ్యులకు అమరావతి వెలగపూడిలోని అసెంబ్లీ హాలులో నిర్వహించిన రెండు రోజుల శిక్షణా తరగతుల్లో 'రాజకీయ నైతికత, ప్రజల్లో గుర్తింపు' అంశంపై జేపీ ప్రసంగించారు. చట్టసభ పద్ధతులు, బడ్జెట్, వివిధ సంక్షేమ కార్యక్రమాలను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సాధికారతతో అర్థం చేసుకోవటం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

శాసనసభ సభ్యులకు ప్రభుత్వాధికారాలు లేవని, కానీ ఓటు వేసిన ప్రజలు ప్రతి పనికీ ఎమ్మెల్యేల మీదే ఆధారపడుతున్నారని జేపీ అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు పనులు చేసి పెట్టటం కోసం ఎమ్మెల్యేలు కార్యకర్తల యంత్రాంగాన్ని పోషిస్తూ భారీగా డబ్బు కూడా ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వాధికారుల్ని చూసి భయపడే ప్రజలు తమ వద్దనున్న ఓటును చూపుతూ ఎమ్మెల్యేల్ని మాత్రం సతాయిస్తుంటారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని, అలసత్వాన్ని, అహంకారాన్ని ప్రక్షాళన చేయకుండా.. చప్పట్ల కోసమో, దండల కోసమో, భూస్వామ్య గౌరవాల కోసమో, ఇతరత్రా అంశాల కోసమో ఎమ్మెల్యేలు కూడా ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా భారం మోస్తున్నారన్నారు.

"శాసనసభ్యులు నిరంతరం ఒత్తిడిలో ఉంటున్నారు. అధికారాలు లేకుండా వారిపై బాధ్యత పెట్టడమే దీనికి కారణం. ఎన్నికలు, పుష్కరాలు వంటి ప్రత్యేక సందర్భాల్లో, తుఫానులు వంటి విపత్తులు వచ్చినప్పుడు, ప్రముఖుల పర్యటనలు వంటి కార్యక్రమాల్లో మన యంత్రాంగం సమర్థంగా పనిచేస్తోంది. ఎందుకంటే, అప్పుడు నిధుల కొరత ఉండదు. జవాబుదారీతనం ఉంటుంది. మిగతా సందర్భాల్లో అవి కనిపించకపోవడంతో మెరుగైన ఫలితాలు రావడం లేదు. ఈ పరిస్థితి మారాలి. అధికార వికేంద్రీకరణ జరగాలి" అని జేపీ పేర్కొన్నారు.

"బలమైన శాసనసభ కమిటీలను నియమించాలి. వాటికి విస్తృతాధికారాలను ఇవ్వాలి. ప్రస్తుతం శాసనసభ్యులకు సభలో గొంతు వినిపించే అవకాశం లేక, బయటా తగినంత గౌరవం లేక.. ఈత రాని వాళ్లను నీళ్లలో పడేస్తే ఎలా ఉంటుందో అలా ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు" అని జేపీ అన్నారు.

"పార్టీ ఫిరాయింపుల్ని ప్రోత్సహించబోనని, వేరే పార్టీకి చెందిన శాసనసభ్యులు తమ పార్టీలో చేరాలనుకుంటే పదవికి రాజీనామా చేసి రావాలని ముఖ్యమంత్రి జగన్ చెప్పటాన్ని మనసారా స్వాగతిస్తున్నా. "మంత్రులు, ఎమ్మెల్యేలు వీఐపీ కల్చర్ తగ్గించుకోవాలి. ఇప్పుడు ఎన్నికైన శాసనసభ్యుల్లో చాలామంది తాజాగా ఆలోచిస్తున్నారు. వారు తలచుకుంటే కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టవచ్చు" అని జేపీ పిలుపునిచ్చారు.

అన్ని వ్యవస్థలూ చేయాల్సిన పనిని చేసేలా సుపరిపాలన అందించాలని రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు అన్నారు. శిక్షణా తరగతులు ఎంతో స్ఫూర్తినిచ్చాయని, లెజిస్లేటర్ల పాత్ర ఎలా ఉండాలనే అంశంపై అవగాహన కలిగించాయని ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. వాస్తవాల ఆధారంగా చట్టసభ సభ్యులు మాట్లాడాలని వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారన్నారు. శాసనసభ ఉప సభాపతి కోన రఘుపతి ఆధ్వర్యంలో శిక్షణ సాగింది. సభాపతి తమ్మినేని సీతారాం, అజేయ్ కల్లాం, చక్రపాణి తదితరులు మాట్లాడారు.






# నాయకత్వంలో ఇలాంటి యువత ఎదిగే అవకాశాల్ని మనం నిర్మించాలి

మార్పు కోసం పరిజ్ఞానంతో, నిబద్ధతతో పనిచేస్తామని దేశం నలుమూలల్నుంచి, వివిధ నేపథ్యాల నుంచి ముందుకొచ్చిన మెరికల్లాంటి యువతను ఆధునిక భారత నిర్మాణోద్యమంలో భాగస్వాముల్ని చేసేందుకు విజన్ ఇండియా ఫౌండేషన్ (వీఐఎఫ్) నిర్వహించిన వార్షిక శిక్షణా శిబిరం-2019లో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ దిశానిర్దేశం చేశారు. ఢిల్లీ ఎన్‌సీఆర్ సోనెపట్ వద్ద ఓపీ జిందాల్ యూనివర్సిటీలో జరిగిన ఈ కార్యక్రమంలో.. విద్యార్థులు, వివిధ వృత్తులు, వ్యాపారాల్లో ఉన్న యువ పట్టభద్రులు 150 మందికిపైగా పాల్గొన్నారు. సమావేశం అనంతరం జేపీ మాట్లాడుతూ.. కార్యక్రమం అద్భుతంగా జరిగిందని, చదువుకున్న అనేకమంది యువ భారతీయులు సమాజానికి సేవ చేయాలన్న తపనతో ఉన్నారని అన్నారు. వారికి నైపుణ్యాలు, తెలివితేటలు ఉన్నాయని, ప్రజాసమస్యలపై ఏళ్ల తరబడి పనిచేస్తున్నవారు కూడా ఉన్నారన్నారు. ఇలాంటి యువత నాయకత్వంలో ఎదగటానికి తగిన అవకాశాల్ని మనం నిర్మించాల్సి ఉందన్నారు. దేశంలోని ఐఐటిల పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు విజన్ ఇండియా ఫౌండేషన్‌ను ప్రారంభించారు. తర్వాత ఇందులో దేశంలోని పేరొందిన విద్యాసంస్థలతోపాటు విదేశాల్లోని ప్రముఖ సంస్థలు కూడా భాగస్వాములయ్యాయి. నైపుణ్యాన్ని, సాంకేతికతను, యువశక్తిని సంస్కరణతో మేళవిస్తూ దేశంలోని పలు రాష్ట్రాలలో ఈ-గవర్నెన్స్, గ్రామీణాభివృద్ధి, విద్య, స్థానిక పాలన వంటి వివిధ ప్రాజెక్టులపై ఈ ఫౌండేషన్ సభ్యులు పనిచేశారు. ఫౌండేషన్ ఎంపిక చేసిన యువతీయువకులలో స్ఫూర్తిని నింపి వారికి దిశానిర్దేశం చేసేందుకు దేశనిర్మాణంలో రోల్‌మోడల్స్‌లా పనిచేస్తున్న విధానరూపకర్తలతో శిక్షణా శిబిరాలను నిర్వహిస్తారు.







RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2018-2020 Published on 10th August, 2019 Posting Date 15 &16th of every month




**BOOK POST**

**PRINT MATTER**

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**